


నృసింహునికి లక్ష పుష్పార్చన

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం విష్వక్సేనపూజ నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీ నృసింహహోమాన్ని అర్చకులు జరిపించారు. అనంతరం స్వామి వారికి లక్ష పుష్పార్చన అత్యంత వేడుకగా జరిగింది. రాత్రి తిరుచ్చి ఉత్సవాన్ని జరిపించి చతుర్వేద పారాయణం, నృత్యం, గీతం వీణానాదం, శంఖనాదం నిర్వహించారు. భక్తులు స్వామివారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

సీడీఈ ఆధ్వర్యంలో యూజీ వైవా ప్రారంభం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యాకేంద్రం(సీడీఈ) ఆధ్వర్యంలో శనివారం నుంచి డిగ్రీ వైవా ప్రారంభమైంది. సీడీఈ పరిధిలోని 29 కేంద్రాల్లో వైవా జరుగుతున్నాయని పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ చెప్పారు. ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల నుంచి 13 మంది ఆచార్యులను నియమించామన్నారు. ఈ నెల 30లోపు వైవా వివరాలను పంపించాలని సూచించారు. పంపకపోతే వారి ఫలితాలను విడుదల చేయమని స్పష్టం చేశారు.

శుభం సందడిలో సమంత



'శుభం' చిత్రం ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు వచ్చిన సినీ నటి సమంత అభిమానులతో సందడి చేశారు. - ఈనాడు, గుంటూరు

అమ్మ ప్రేమ ఆకాశమంత



నేడు మాతృ దినోత్సవం

కని పెంచి.. కనిపించి
నడిపించే దైవమే అమ్మ..
తొలి స్పర్శ ఆమెదే
తొలి పలుకు తనదే..
కష్టసుఖాల ఓదార్పు
అలుపెరుగని ఓర్పు...
అమితమైన అనురాగం
అద్భుతమైన స్నేహం అమ్మ

– న్యూస్‌టుడే, పట్టాభిపురం, తెనాలి టౌన్

తోడు.. నీడ..



కుమార్తె శివానితో తల్లి సుష్మ

కన్నబిడ్డ కంట నీరొలికితే ఏ తల్లీ తట్టుకోలేదు. అలాంటిది మాట వినలేక.. సరిగా మాట్లాడలేని స్థితిలో ఉన్న కుమార్తె శివానిని చూసి తల్లడిల్లిపోయారు తెనాలికి చెందిన సుష్మ. పాపకు ఏడాది వయసులో ఈ సమస్యను గుర్తించినప్పట్నుంచి ఈనాటి వరకూ తన వెన్నంటే నిలిచారు. హిందీ పండిట్ పట్టా అందుకున్న సుష్మ ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవాలనుకున్నారు. కానీ.. కుమార్తె అందరిలా జీవించాలంటే తోడుగా ఉండాలన్న ఉద్దేశంతో ఆమెకే పూర్తి సమయం కేటాయించారు. తితిదే ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న శ్రవణ్ పాఠశాలకు తీసుకెళ్లి చికిత్స ఇప్పించారు. అక్కడున్న ప్రత్యేక పరికరాలు, స్పీచ్ థెరపీ ద్వారా పిల్లల కుటుంబ సభ్యులకు కూడా శిక్షణ ఇస్తారు. కుమార్తెతోపాటు మూడేళ్లపాటు అక్కడే ఉన్న సుష్మ తిరిగి తెనాలి వచ్చి స్థానిక పాఠశాల్లోనే చదివించారు. అమ్మ అండతో శివాని పదో తరగతి ఫలితాల్లో 88 శాతం మార్కులు సాధించింది. ఇంటరులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ప్రస్తుతం తెనాలి ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. డిగ్రీలోనూ ఇప్పటివరకు జరిగిన పరీక్షల్లో ప్రథమ శ్రేణిలోనే నిలిచింది. అంతేకాదు.. చక్కటి చిత్రాలు గీసి అందరి ప్రశంసలు అందుకుంటోంది. అమ్మ తోడు, ప్రోత్సాహం లేకుంటే ఇదంతా ఏమీ లేదంటోంది శివాని .. కూతురు అందరిలా ఆడుతూ పాడుతూ జీవితం గడిపితే తనకదే చాలంటున్నారు సుష్మ.

విజయాల వెనుక... ముందు ఆమె

– ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి విజయ్‌బాబు



నా ప్రతి విజయం వెనుక, ముందు ఉన్నది అమ్మ రాజ్యలక్ష్మే. కుటుంబం తెనాలిలో ఉంటోంది. అమ్మ డిగ్రీ చదివారు. నాన్న మధుబాబు విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి. సివిల్స్‌లో తొలి ప్రయత్నంలోనే 682 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యా. ఆదాయపు పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా విజయవాడలో విధులు నిర్వహిస్తున్నా. ఇంకా మంచి ర్యాంకు కోసం సివిల్స్ రాశా. ఇటీవల వెలువడిన ఫలితాల్లో 681వ ర్యాంకు వచ్చింది. తెల్లవారుజామున 4.30 గంటలకు మమ్మల్ని నిద్ర లేపడం మొదలుకుని తిరిగి రాత్రి నిద్రపోయే వరకు ప్రతి నిమిషాన్ని క్రమశిక్షణగా ఎలా సద్వినియోగం చేసుకోవాలో నేర్పారు. పాఠశాల, ఇంటరులో మంచి ఫలితాలు సాధించేందుకు నాకంటే ఆమే ఎక్కువ అధ్యయనం చేశారు. దగ్గరుండి చదివించారు. డిగ్రీ తరువాత సివిల్స్‌కు నేను ఇంటివద్దనే ఉండి సాధన చేయడానికి కారణం అమ్మే. అమ్మ టీవీ చూడడంకానీ.. సెల్‌ఫోన్లో ఎక్కువ సమయం గడపడం కానీ చూడలేదు. కొన్ని అనారోగ్య సమస్యలున్నా.. ఏ ఒక్క రోజు కూడా వంట మానలేదు.

తీర్చిదిద్దిన గురువు

– చల్లా పవన్ కల్యాణ్



అమ్మ చల్లా భువనేశ్వరి బీఎస్సీబీఈడీ చేశారు. అప్పట్లో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. నన్ను సోదరి నిహారిక (అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి)ను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న తపనతో అచ్చంపేట మండలం రుద్రవరం నుంచి గుంటూరుకు పాతికేళ్ల క్రితం వచ్చేశారు. మమ్మల్ని చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించారు. పదో తరగతి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్లలో రాణించా. ఓ వైపు చదువు, మరోవైపు క్రీడల్లో మేమిద్దరం రాణించామంటే అమ్మ తీసుకున్న కేర్ వల్లనే. తిరుచ్చి ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాక బెంగళూరులో అమెరికన్ నేరో స్పేస్ కంపెనీలో ప్లేస్‌మెంట్ వచ్చింది. ఉద్యోగానికి వెళ్లనని, సివిల్స్ రాస్తానని అమ్మకు చెబితే ప్రోత్సహించారు. సివిల్స్ మొదటిసారి రాసినప్పుడు మెయిన్స్‌కు ఎంపికవలేదు. రెండోసారి ఇంటర్వ్యూలో పోయింది. అయినా అమ్మ ఒక్క మాట కూడా అనలేదు. ఎక్కడెక్కడ తప్పులు దొర్లాయో తెలుసుకుని వెన్నుతట్టి ప్రోత్సహించడంతో. మూడోసారి సివిల్స్‌లో 146వ ర్యాంకు సాధించా. సోదరి నిహారిక చెస్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూనే ఎంబీఏ పూర్తి చేయడం వెనుకా అమ్మ ఇచ్చిన ప్రోత్సాహమే.

నాతోపాటు శ్రమించి.. విజయుడిగా నిలిపి

– ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ మల్లవరపు సూర్యతేజ



2020 సివిల్స్‌లో 76వ ర్యాంకు సాధించానంటే అది అమ్మ సంధ్యారాణి ఇచ్చిన ప్రోత్సాహం వల్లే. బీటెక్ పూర్తి చేసి కొన్నాళ్లు టీసీఎస్‌లో ఉద్యోగం చేశా. అలా కాలం గడిచిపోతున్న తరుణంలో నాకు చిన్నప్పటి లక్ష్యం గుర్తు చేసింది అమ్మే. ఎనిమిదో తరగతిలో ముస్సోరిలోని ఐఏఎస్ అకాడమీ ట్రిప్‌నకు నాన్న శ్రీనివాసరావుతో కలిసి అమ్మ, నేను వెళ్లాం. కుటుంబంలో ఇప్పటి వరకు ఎవ్వరూ ఐఏఎస్ అవలేదు. ఎవరో ఒకరు అవ్వాలని నాన్న అన్నారు. నేను అవుతానని చెప్పా. నా ఇంజినీరింగ్ పూర్తయ్యాక నాన్న అనారోగ్యంతో మృతి చెందారు. టీసీఎస్‌లో చేరా. కొన్నాళ్లు చేశాక బయటకొచ్చేసి సివిల్స్‌కు సొంతంగానే ప్రిపేరయ్యా. నాలుగు పర్యాయాలు రాశా. ప్రతిసారీ ఏదో ఒక దశలో పోతుండేది. ఆ సమయంలో అమ్మ ఇచ్చిన ప్రోత్సాహం మరిచిపోలేను. నాకు మంచి ర్యాంకు వచ్చిందంటే అమ్మ చలవ వల్లే. ఆమె బీఏ చేశారు. ప్రిపరేషన్‌లో భాగంగా అర్ధరాత్రి వరకు నాతోపాటు శ్రమించారు. సివిల్స్‌కు సంబంధించిన పలు అంశాలను తను తెలుసుకుని నాకు చెప్పేవారు. ఎక్కడెక్కడ తప్పులు చేస్తున్నానో.... వాటిని ఎలా సరిదిద్దుకోవాలో చెప్పేవారు. నాన్న శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వంలోని లేబర్ బ్యూరోలో ఉద్యోగి. అహ్మదాబాద్, చండీఘడ్ తదితర ప్రాంతాల్లో నా చదువులు సాగాయి. అక్కడ వాతావరణ పరిస్థితుల వల్ల నాకు ఇబ్బందులు తలెత్తకుండా అమ్మ ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు.

న్యాయమూర్తి పదవి పవిత్రమైనది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ జయసూర్య. వేదికపై జస్టిస్ శేషసాయి, జడ్జి సాయి కల్యాణ్‌చక్రవర్తి

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: న్యాయమూర్తి పదవి అత్యంత పవిత్రమైనదని, దాని విలువలు కాపాడేందుకు న్యాయమూర్తులు మరింత కృషి చేయాలని గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జి జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య పిలుపునిచ్చారు. శనివారం ఉదయం గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో న్యాయపరిమితి చట్టంపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ జయసూర్య మాట్లాడుతూ.. కేసుల్లో తీర్పులు చెప్పే అవకాశం న్యాయమూర్తులకు లభించిందంటే అది అదృష్టంగా, బాధ్యతగా భావించాలన్నారు. 'కేసులు, సమస్యలపై అవగాహన పెంచుకుని ఆచితూచి తీర్పులను వెలువరించాలి. సీనియర్ న్యాయవాదులను గౌరవించాలి. నాణ్యమైన తీర్పులు ఇవ్వటానికి చర్యలు తీసుకోవాలి. న్యాయవాదులతో సఖ్యతగా మెలుగుతూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఈపీలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవసరమైతే వాటిపై అవగాహన పెంచుకునేందుకు ఓ కార్యక్రమం నిర్వహిద్దా'ని చెప్పారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ బి.శివశంకరరావులు కూడా కాలపరిమితి చట్టంతో పాటు కోర్టుల్లో న్యాయమూర్తులు వ్యవహరించాల్సిన పద్ధతులను వివరించారు. అదనపు జిల్లా జడ్జిలు వీఏఎల్ సత్యవతి, వై. నాగరాజ, సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు, ఆర్.శరత్‌బాబు, జి.చక్రపాణి, నీలిమ, పర్వి సుల్తానా బేగంతో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

★ జిల్లా ఇన్‌ఛార్జి జడ్జిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి గుంటూరుకు వచ్చిన జస్టిస్ జయసూర్యను న్యాయశాఖ నాలుగో తరగతి సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పీపీపీ విధానంలో తెనాలి పురపాలక సంఘ భవన నిర్మాణం



పురపాలక సంఘం కార్యాలయ భవనం నమూనా



మాట్లాడుతున్న మంత్రి మనోహర్, పక్కన ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన తెనాలి పురపాలక సంఘం కార్యాలయ నూతన భవనాన్ని అత్యాధునికంగా నిర్మిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ పురపాలక సంఘం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎందరో మహానుభావులు ఛైర్మన్లు, ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లుగా సేవలందించారన్నారు. 1966లో ప్రారంభించిన పురపాలక సంఘ భవనం శిథిలావస్థకు చేరిందని, దీన్ని కూల్చివేసి 2.2 ఎకరాల్లో రూ.40 కోట్లతో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో పార్కింగ్, ఐదంతస్తుల నూతన భవనం నిర్మించుకోనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆర్కిటెక్ట్ కె.నవీన్ రూపొందించిన ఆ భవన నమూనాను చూపారు. చెంచుపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే పాదచారులు వాహనాల రద్దీతో ఇబ్బంది పడుతున్నారని, వీరి కోసం మార్కెట్ సెంటర్లోని అన్న క్యాంటీన్ నుంచి చెంచుపేట వరకు కాలినడక వంతెన నిర్మించాలని 2011లోనే భావించానని, దాన్ని ఇప్పుడు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులోని పురపాలిక స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఈత కొలను, బాస్కెట్ బాల్ కోర్టు, క్రికెట్ శిక్షణ కేంద్రం, స్కేటింగ్ రింగ్, ఓపెన్ ఎయిర్ జిమ్‌లకు నమూనాలు తయారు చేశారన్నారు. వీటిని ఇప్పటికే తీసుకొచ్చిన రూ.10 కోట్ల నిధులతో చేపట్టనున్నట్టు తెలిపారు. ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు.

దిద్దివేత డబ్బులేవి?

పెండింగ్‌లో పది పేపర్ల మూల్యాంకన రుసుములు
ఉమ్మడి జిల్లాలో 4 వేలమందికి పైగా ఎదురుచూపు

ఈనాడు – అమరావతి

గతేడాది జూన్‌లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ.. ఈ ఏడాది మార్చిలో రెగ్యులర్ పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు మూల్యాంకన రుసుములు ఇంకా చెల్లించలేదు. ఈ నెల 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే రెండు విడతల బకాయిలు పేరుకుపోవడంతో స్పాట్ విధుల్లో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదని పాఠశాల విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. విద్యాశాఖకు స్పాట్ నిర్వహణ వ్యయాలూ ఇంకా చెల్లించలేదు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజులోంచి కొంతమొత్తాన్ని స్పాట్ నిర్వహణకు, వాల్యుయేషన్‌కు చెల్లిస్తుంటారు.

జిల్లాల విభజన అనంతరం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఎక్కడికక్కడ స్పాట్ వాల్యుయేషన్ నిర్వహిస్తున్నారు. వాటి నిర్వహణకే ఒక్కో జిల్లాకు ఒక్కో క్యాంప్‌నకు రూ.30 లక్షలకుపైగా నిర్వహణ వ్యయాలయ్యాయి. ఇప్పటిదాకా రెండు క్యాంప్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సగటున ఒక్కో జిల్లాకు రూ.అరకోటికి పైగా చెల్లించాల్సి ఉంది. పెద్ద మొత్తంలో బిల్లులు పేరుకుపోవటంతో విద్యాశాఖ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. క్యాంప్ కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో మూల్యాంకనం చేసేందుకు ఉపాధ్యాయులకు బల్లలు, కుర్చీలు, కూలర్లు, ఫ్యాన్లు వంటివి ఏర్పాటు చేస్తారు. సుమారు 12 రోజుల పాటు క్యాంప్ నిర్వహించారు. టెంట్ నిర్వాహకులు బకాయిల కోసం ఒత్తిడి తెస్తున్నారు.

❖ మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఒక్కొక్కరికి రూ. 10 వేలకుపైగానే పెండింగ్ ఉందని వారు చెబుతున్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం నుంచి తమకెలాంటి బడ్జెట్ విడుదల కాలేదని ఉమ్మడి జిల్లా విద్యాశాఖవర్గాలు తెలిపాయి.

❖ మూడు జిల్లాల పరిధిలో రెగ్యులర్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలకు 4 వేలమందికి పైగా ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. వీరందరూ బకాయిల విడుదల కోసం ఉపాధ్యాయ సంఘాల ద్వారా విద్యాశాఖాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

❖ మూడు జిల్లాల పరిధిలో మూల్యాంకన రుసుములు, టెంట్ తదితరాలకు రూ. 2 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని నోడల్ డీఈవో.. పరీక్షల విభాగానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది.

❖ దూరవిద్యలో పది, ఇటరు జవాబుపత్రాలు మూల్యాంకనం చేసిన సుమారు 400 మంది ఉపాధ్యాయులకు కూడా రుసుములు చెల్లించలేదు.

తినే ముందు ఆలోచించండి

ఈనాడు – అమరావతి

- వాటిల్లో క్లోరిపైరిపాస్ అవశేషాలు
- విచ్చలవిడిగా వినియోగం

పండే విషంగా మారితే.. కూరగాయలే నిలువెల్లా గాయాలు చేస్తుంటే...



అచ్చంగా ఇదే జరుగుతోంది. పండ్లు, కూరగాయల సాగులో విచ్చలవిడిగా క్లోర్‌పైరిఫాస్ రసాయన వాడకం వల్ల దాని అవశేషాలు ఉండిపోయి వాటిని తిన్నవారిలో అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక, ప్రమాదకర వ్యాధులతో బాధపడుతున్నవారు ఆ ఉత్పత్తులను నేరుగా తినడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. పండ్లు, కూరగాయల పంటల్లో పురుగుల నివారణకు రైతులు ఆ రసాయనం వాడుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో వరి, కూరగాయలు, ఆకుకూరలు, కొన్ని రకాల పండ్ల జాతుల పంటల్లో క్లోర్‌పైరిపాస్ వినియోగం ఎక్కువగా ఉంది. ఇతర రకాల మందులతో కలిపి (కాంబినేషన్) కూడా దీనిని చల్లుతున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తుల్లోనూ దీని అవశేషాలు బయటపడడం గమనార్హం. క్లోర్‌పైరిఫోస్ మందు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

పురుగులను నివారించేందుకు..

లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, గులాబీరంగు పురుగు, పచ్చపురుగు, ఆకుచుట్టు పురుగు, మొవ్వ పురుగు తదితరాలు.. పంటలను నాశనం చేస్తున్నాయి. వీటి నివారణకు నాలుగు దశాబ్దాలుగా క్లోర్‌పైరిపాస్ చల్లుతున్నారు. ఎకరాకు అర లీటరు సిఫార్సు ఉన్నప్పటికీ అధికంగా వాడటంతో దాని అవశేషాల వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాస్తవానికి క్లోర్‌పైరిపాస్ మందు పిచికారీ చేసిన వారం రోజుల తర్వాతే పండ్లు, కూరగాయలు కోయాలి. చాలా మంది రైతులు మందు చల్లిన రెండు లేదా మూడు రోజులకు కోసేస్తున్నారు. కొందరు రైతులు మోతాదుకు మించి కూడా చల్లుతున్నారు. ఎర్రనేలలున్నచోట చెదల నివారణకు కూడా దీన్ని వాడుతున్నారు. ఇళ్లు, భవనాల నిర్మాణ సమయంలో పునాదుల దశలో క్లోర్‌పైరిపాస్ వేస్తున్నారు.

ప్రత్యామ్నాయాలు వాడితే....

పంటల్లో పురుగుల నివారణకు ఇటీవల నూతన క్రిమిసంహారకాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. పురుగులను వేగంగా చంపటానికి అధిక గాఢత కలిగిన కొత్త రకాల మందులను రైతులు చల్లుతున్నారు. క్లోర్‌పైరిపాస్‌తో కలిపి ఇతర మందులను సైతం చల్లుతున్నారు. పూత వచ్చిన సమయం నుంచి కాయ ఏర్పడే దశ వరకు ఈ మందు చల్లితే అవశేషాలు కాయలోపల ఉండిపోతున్నాయి. కూరగాయలు, పండ్లను బాగా కడిగి వినియోగించాలని పల్నాడు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ సూచిస్తున్నారు.

ద్విచక్రవాహనంతో ఢీకొట్టి.. బండరాయితో మోది

ఆస్తి కోసం తండ్రిని కర్కశంగా హతమార్చిన కుమారుడు

మంగళగిరి, న్యూస్‌టుడే: ఆస్తి కోసం కన్న తండ్రినే కుమారుడు కర్కశంగా హతమార్చిన సంఘటన ఇది. ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి మండలం బేతపూడికి చెందిన శ్రీనివాసరావు (57) వ్యవసాయ పనులు చేస్తుంటారు. అతడికి కుమారుడు పరమేశ్వరరావు ఉన్నాడు. కొద్దిరోజులుగా శ్రీనివాసరావు తన పేరున ఉన్న కొంత స్థిరాస్తిని విక్రయించేందుకు వేరొకరితో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇది కుమారుడికి ఇష్టం లేదు. దీంతో ఇరువురి మధ్య గత కొద్దిరోజులుగా వివాదం కొనసాగుతోంది. తనకు ఆస్తి దక్కకుండా పోతుందనే ఆగ్రహంతో ఈ నెల 9వ తేదీ శ్రీనివాసరావు నడిచి వెళ్తుండగా పరమేశ్వరరావు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి... కింద పడిపోయిన తండ్రి తలపై బండరాయితో మోది హతమార్చినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ వెంకట్ చెప్పారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా హత్యకేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దుగ్గిరాల ఇక స్పెషల్ గ్రేడ్ పంచాయతీ



దుగ్గిరాల పంచాయతీ కార్యాలయం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల ఇక స్పెషల్ గ్రేడ్ పంచాయతీ కానుంది. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం జనాభా, ఆ పంచాయతీ ఆదాయం ప్రకారం గ్రేడ్లు నిర్ణయించారు. 10 వేలు జనాభా దాటి ఉన్నా లేకుంటే రూ. కోటి ఆదాయం ఉన్నా ఆ పంచాయతీని స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా నిర్ధారించారు. దుగ్గిరాల గ్రామంలో 2011 లెక్కల ప్రకారం 11,314 జనాభా ఉన్నారు. ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెరిగింది. ప్రస్తుతం 13 వేలు వరకూ జనాభా ఉంటారనేది అంచనా. మండలంలోని పంచాయతీల గ్రేడ్లు మారాయి. 18 పంచాయతీల్లో ఈమని, చిలువూరు, రేవేంద్రపాడు గ్రేడ్-1 పంచాయతీలు అవుతున్నాయి. పేరకలపూడి, పెదపాలెం, పెదకొండూరు, మోరంపూడి, మంచికలపూడి, తుమ్మపూడి, కంఠంరాజుకొండూరు, పెనుమూలి ఇవన్నీ గ్రేడ్-2 పంచాయతీలు కానున్నాయి. గొడవర్రు, వీర్లపాలెం, చినపాలెం, చుక్కపల్లివారిపాలెం, శృంగారపురం, చింతలపూడి గ్రామాలు గ్రేడ్-3 పరిధిలోకి వస్తాయి. సిబ్బంది కేటాయింపు కోసం ఈ గ్రేడ్లు చేశారని అంటున్నారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీకి ఒక ఈవోపీఆర్డీ(డిప్యూటీ ఎంపీడీవో)ను ఇవ్వనున్నారు. ఈ గ్రేడ్ల ప్రకారమే సచివాలయ ఉద్యోగుల సంఖ్య ఉండనుంది. ఇప్పటి వరకు నోటిఫైడ్(మేజర్) పంచాయతీగా ఉన్న పెనుమూలి తొలిసారిగా నాన్‌నోటిఫైడ్(మైనర్)కు వెళ్లనుంది. గ్రేడ్ల విషయమై ఈ నెల 13న డిప్యూటీ ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు సమావేశమై తుది నివేదిక కలెక్టర్‌కు ఇవ్వనున్నారు.

విద్యాసంవత్సరం నష్టపోకూడదని

పదిలో అనుత్తీర్ణులకు ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతుల్లో సాధన చేస్తున్న విద్యార్థులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఈ నెల 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నందున విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏ ఒక్క విద్యార్థీ విద్యా సంవత్సరం కోల్పోకుండా రానున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సాధన చేయిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఇచ్చిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జక్టుల ఉపాధ్యాయులు.. విద్యార్థులను దత్తత తీసుకుని సాధన చేయిస్తున్నారు.

☛ జిల్లాలో 3,126 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్ష తప్పారు. వీరికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నపత్రాల్లోని ముఖ్యమైన ప్రశ్నలు సాధన చేయిస్తున్నారు. వారికి పరీక్షలు నిర్వహించి లోపాలు గుర్తించి సరిచేసుకునేలా సూచనలిస్తున్నారు. బృంద చర్చల ద్వారా ఆయా సబ్జెక్టుల్లో ఉండే సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

☛ కొన్నిచోట్ల విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసినా ఫలితం ఉండడం లేదని ఆవేదన చెందుతున్నారు.



☛ సమయం తక్కువగా ఉన్నందున ప్రతీ విద్యార్థిపై దృష్టి సారించి ముఖ్యాంశాలు సాధన చేయిస్తున్నామని **డీఈవో సీవీ రేణుక** చెప్పారు.



రైతు కష్టానికి నిప్పు.. ఎప్పటికి కనువిప్పు

ఏటా మొక్కజొన్న పంట తగలబడి నష్టపోతున్న అన్నదాతలు

- దుగ్గిరాలలో ఒక చోట మొక్కజొన్న చేలకు నిప్పు పెట్టడంతో సమీప చేలల్లోని 12 ఎకరాల పంట కాలిపోయింది. ఫలితంగా రైతులు రూ. 5 లక్షలకు పైగా నష్టపోయారు. అరగంటలో శ్రమ బూడిదలో పోసినట్లయింది.
- పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రులో మొక్కజొన్న చేలకు నిప్పు పెట్టడంతో అరెకండ్ల ఏసుబ చెందిన 2.5 ఎకరాల పంట బూడిదైంది.
- దుగ్గిరాలకు చెందిన వాసిరెడ్డి సుధాకర్ మొక్కజొన్న చేలు గతేడాది దాదాపు ఎకరన్నర దగ్ధమైంది. సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లింది.
- రెండేళ్ల క్రితం వేరకలపూడి వద్ద పెదపాలెం మధ్య ఇలానే చేలు దగ్ధమయ్యాయి. నలుగురు రైతులకు చెందిన సుమారు 4 ఎకరాల మొక్కజొన్న కాలిపోయింది.

దుగ్గిరాల, న్యూస్‌టుడే

దాదాపు ఏడెనిమిదేళ్లుగా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి ఏడాది ఎవరో ఒకరి చేలో పంట పూర్తి అయ్యాక ఆ చేలో పెట్టిన నిప్పు తోటి రైతుల ఆశల్ని దహించేస్తోంది. చేలో కండెలు తీసేశాక అక్కడక్కడా చిన్న చిన్న కండెలు ఉండిపోతాయి. వీటిని ఏరుకునేందుకు వచ్చే వాళ్లు ఇలా నిప్పు పెడుతున్న సంఘటనలే ఎక్కువగా జరిగాయి. అక్కడక్కడా కొందరు రైతులు కూడా తమ పని అయిపోయిందిలే అనుకుని పక్క రైతు పరిస్థితి ఆలోచించకుండా నిప్పు పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. ప్రతి ఏడాది ఇలా జరుగుతున్నా ఎవరు కారకులు అనే ఆరా లేదు. సంబంధితులపై చర్యలు లేవు.


ఏం చేయాలి.. మొక్కజొన్న పంట అయిపోయాక ఆ చొప్పను కాల్చకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పంట చేతికి రాగానే చొప్పను కలియ దున్నేయాలనే నిబంధన పక్కాగా అమలు చేయాలి. అలా దీంతో పంట మార్పిడి విధానాన్ని కచ్చితంగా అమల్లో పెట్టాలి. రబీలో మినుము, పెసర వంటివి మాత్రమే వేయాలనే నిబంధన పెట్టాలి. దీని వల్ల భూసారం పెరగడంతోపాటు ఎరువుల వాడకం కూడా తగ్గుముఖం పడుతుంది. చొప్ప తగుల బెట్టకపోవడం వల్ల వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది.


కాలిపోతున్న మొక్కజొన్న కండెలు, దట్టంగా వ్యాపిస్తున్న పొగ

కలియ దున్నడంతో భూసారానికి మేలు..

పంజాబ్‌లో పంటల చొప్పను నిప్పుపెట్టడం వల్లే దిల్లీలో ఎక్కువగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇక్కడి రైతులు మొక్కజొన్న చొప్పను తగుల బెట్టకుండా రోటావేటర్ సాయంతో కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. దీని వల్ల తర్వాత వేసే పంటకు ఎరువుల వాడకం తగ్గి సాగు ఖర్చులు ఆదా అవుతాయి. **-రాజకుమారి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్**

విద్యావ్యవస్థలో మరిన్ని మార్పులు అవసరం


మాట్లాడుతున్న విశ్రాంత డీజీపీ మాలకొండయ్య


వజ్రోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, మాజీ ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాలపర్రు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని విశ్రాంత డీజీపీ మాలకొండయ్య అన్నారు. శనివారం ఉదయం పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నాగసింహా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధనకే పరిమితం కాకుండా విద్యార్థులు కూడా కష్టపడి చదివి నైపుణ్యాలు సాధించాలని సూచించారు. విశ్రాంత అదనపు ఎస్పీ కాకాని సత్యనారాయణ మాట్లాడుతూ పాలపర్రులో ఈ పాఠశాల ఏర్పాటు చేసి విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన ముద్దన చెంచయ్య మహనీయుని కొనియాడారు. పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎం. రమేష్‌బాబు, వజ్రోత్సవ ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎం. మణికుమార్, ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థి ఎం. ధర్మలక్ష సామాజిక అంశాలను సైతం వివరించాలని, వారి ఆలోచన సరళిని మెరుగుపరిచే విధంగా నిర్మాణాత్మకంగా పనిచేయాలని పేర్కొన్నారు. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా భ్రష్టు పట్టించింది

సాయంత్రం నిర్వహించిన సభలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య మాట్లాడుతూ వైకాపా పాలనలో జగన్ ఎయిడ్ పోస్టులను రద్దు చేసి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. పాఠశాల ఏర్పాటుకు మొత్తం ఆస్తిని వెచ్చించిన దాత ముద్దన చెంచయ్య చిరస్మరణీయులని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ వజ్రోత్సవాలు గొప్పగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. తెలుగు కేవ కోసం అతిథులు.. అనంతరం పూర్వవిద్యార్థి చిట్టినేని కోటేశ్వరరావు సహకారంతో రూపొందించిన వజ్రోత్సవ సంచికను ఆవిష్కరించారు. పి.ప్రసాద్ రచించిన 'పబ్లిక్ స్పీకింగ్ ఇన్ ఇంగ్లిష్' పుస్తకాన్ని కూడా వారు ఆవిష్కరించారు.

సబ్‌కా నూతన కార్యవర్గం ఎన్నిక

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) గుంటూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశం శనివారం లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా టి.ప్రభాకర రెడ్డి, ఎన్.నాగభూషణం, కార్యదర్శిగా ఎన్.భూపేంద్రనాథ్, కోశాధికారిగా ఎం.గంగయ్య, సంయుక్త కార్యదర్శులుగా సిహెచ్.రవిబాబు, శివరాం, సమన్వయకర్తగా సిహెచ్.విష్ణువర్ధనరెడ్డి, సలహాదారులుగా కె.వెంకటేశ్వరరెడ్డి, జి.శివకుమార్, కె.జయరాంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎ.రాంబాబు, కె.పూర్ణచంద్రరావు, పి.శివయ్య ఎన్నికైనట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడారు.


సమగ్రాభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి


మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 26 జిల్లాల సమగ్రాభివృద్ధితోనే ప్రగతి సాధ్యమౌతుందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు రామన్నపేటలోని జనచైతన్య వేదిక కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధిపై ముఖాముఖి కార్యక్రమం శనివారం జరిగింది. శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీల అమలుకు అధికార, ప్రధాన ప్రతిపక్షాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే స్థితిలో లేవన్నారు. పోలవరం-బనకచర్ల భారీ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెరపైకి తీసుకొస్తున్నారని, ఇది రాష్ట్రానికి భారంగా మారనుందన్నారు. లక్ష జనాభా ఉన్న అమరావతికి 197 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనన్నారు. గత ప్రభుత్వంలో శిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అవినీతి చేసిందని ఆరోపించి, తిరిగి వారి చేతిలో విద్యుత్తు రంగాన్ని పెట్టడం దారుణమన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ జలవనరులను సద్వినియోగం చేసుకుని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తే వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగి, సంపద, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోవడం, ఆరోగ్యశ్రీ సేవలు ఆసుపత్రులకు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులు, పేద రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతపరిస్తేనే ప్రభుత్వాలు సక్రమంగా నడుస్తాయన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ అవధానుల హరి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

పెదకాకాని, న్యూస్‌టుడే: స్థానిక మల్లేశ్వర స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు న్యాయమూర్తి దంపతులకు ఆశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందించారు.


జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న వేద పండితుడు

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి, వేదికపై రమాదేవి, అరుణ్‌కుమార్, లక్ష్మణరావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి రమాదేవి స్పష్టం చేశారు. శనివారం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో కార్మిక సంఘాల నాయకులతో సదస్సు నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికుల హక్కులు హరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తయారు చేసి బలవంతంగా కార్మికులపై రుద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసి కార్మికుల హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రమాదేవి మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగవర్గాలను కార్పొరేట్ కబంధ హస్తాలకు అప్పజెప్పే కేంద్ర ప్రభుత్వ కుయుక్తులను పోరాటంతోనే ఎదుర్కొంటామన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయు జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శులు హనుమంతరావు, లక్ష్మీనారాయణ, నాయకులు కోటయ్య, రవి, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులకు ప్రాధాన్యమివ్వాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలని శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. కలెక్టరేట్ సమీపంలోని సమావేశ మందిరంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎల్లయ్య మాట్లాడుతూ 40 శాతం వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగ ఉపాధ్యాయులకు ప్రాధాన్య కేటగిరిలో చేర్చాలన్నారు. 70 శాతం వైకల్యం దాటిన వారిని సాధారణ బదిలీల నుంచి మినహాయించాలని, వారు కోరుకుంటే మొదటి ప్రాధాన్యం వారికే ఇవ్వాలని విన్నవించారు. దివ్యాంగ ఉపాధ్యాయుల బదిలీల విషయమై హైకోర్టు స్పందించడం హర్షణీయమని తెలిపారు. దివ్యాంగ ఉపాధ్యాయులకు అనుకూలంగా తుది తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘ నాయకులు బాలరాజు, లక్ష్మీనారాయణ, శివ నాగేంద్ర, పెద్దయ్య పాల్గొన్నారు.

అమరావతిలో ఎన్టీఆర్ ఫిలింనగర్ ఏర్పాటు చేయాలి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సినీపరిశ్రమను ఏర్పాటు చేయాలని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా కోరారు. గుంటూరులోని ఓ హోటల్లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సినిమాల చిత్రీకరణ కోసం అమరావతిలోనే స్టూడియోల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాజధాని కోసం కేటాయించిన భూమిలో వంద ఎకరాల్లో ఎన్టీఆర్ ఫిలిం నగర్ ఏర్పాటు చేస్తే హైదరాబాద్ నుంచి సినీపరిశ్రమ కొంత మేర ఇక్కడకు వస్తుందన్నారు. సినిమాలకు కావాల్సిన లొకేషన్లు ఆంధ్రాలో ఉన్నాయని... ఔత్సాహిక నిర్మాణ సంస్థలకు తిరుపతి, లంబసింగి, అరకు లోయ, రాజమండ్రిలో స్థలాలను ప్రభుత్వ ధరకు కేటాయిస్తే బాగుంటుందన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును స్వయంగా కలిసి అభిప్రాయాలు వెల్లడించనున్నట్లు ఆయన చెప్పారు.

మొక్కజొన్న చేలో బుగ్గైన రైతు జీవితం


నరసింహారావు (పాత చిత్రం)

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఆయనకు సాగంటే ప్రాణం.. చిన్ననాటి నుంచి వ్యవసాయం చేస్తూనే కుటుంబాన్ని పోషించారు. ఆరోగ్యం సహకరించకపోయినా కుమారుడితో కలిసి నిత్యం మొక్కజొన్న చేల వద్దకు వచ్చి పనులు పర్యవేక్షిస్తుంటారు. ఇందులో భాగంగానే పొలం వద్ద ఉండగా.. సమీపంలోని మొక్కజొన్న పంటకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పు.. ఆయన పాలిట మృత్యుశాసనమైంది. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. దుగ్గిరాలకు చెందిన తాడిబోయిన నరసింహారావు(62)కు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్ల కిందట ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఆయన కాలికి తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి రెండుసార్లు మోకాలికి శస్త్రచికిత్స చేశారు. దీంతో కొన్ని సంవత్సరాలు ఆయన వాకర్‌తో నడిచేవారు. ఆరోగ్యరీత్యా మరికొంత ఇబ్బందిపడ్డారు. దీని కోసం ఆయన లక్షలాదిరూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. అన్ని కష్టాల్ని తట్టుకుని ఆయన నిలబడగలిగారు. దాదాపు ఏడాది కాలంగా ఆయన కొంత నడవగులుతున్నారు. దీంతో కొడుకుతో కలిసి మళ్లీ స్వయంగా వ్యవసాయం చేయడంపై దృష్టిసారించారు. ప్రస్తుతం ఆయన మూడెకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. చేలో మొక్కజొన్న కండెలు మిషన్‌లో వేసి గింజలుగా తీసే ప్రక్రియ జరుగుతుండడంతో ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం ఆయన పొలం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో పక్కల చేలో ఉన్న మొక్కజొన్న చొప్పకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గాలి ఎక్కువగా ఉండడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బయటకు వచ్చే క్రమంలో ఆయన కిందపడిపోవడంతో శరీరమంతా తీవ్రమైన కాలిన గాయాలయ్యాయి. వెంటనే చుట్టుపక్కల ఉన్న రైతులు తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి... అక్కడి నుంచి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, రిటైల్ ధర - 149, చికెన్ విత్‌స్కిన్ - 216, చికెన్ స్కిన్‌లెస్ - 246.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -124 రిటైల్ ధర 146 చికెన్ విత్ స్కిన్ - 212, చికెన్ స్కిన్‌లెస్ - 241.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 500 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

కౌలు రైతు ఆత్మహత్య


నరసింహారావు (పాత చిత్రం)

పొన్నూరు, న్యూస్‌టుడే : సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధి వెల్లలూరుకు చెందిన నక్కా నరసింహారావు(47) ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేశారు. అందులో నష్టాలు రావడంతో పాటు గతంలో చేసిన వాటితో కలిసి రూ.5 లక్షలు అప్పులయ్యాయి. వాటిని తీర్చలేక నరసింహారావు మనస్తాపానికి గురై గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పొన్నూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఆయన్ను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ నరసింహారావు శనివారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌బాబు తెలిపారు. భార్య నక్కా శివకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

అమ్మ స్పర్శ అంతులేని పరవశం



అమ్మ అమృత కలశం
అమ్మ స్పర్శ అంతులేని పరవశం!
అమ్మ చేతి ముద్ద పాయసం
అమ్మ చేయూత చేయిస్తోంది సాహసం!
అమ్మతో గడిపిన క్షణం రాజసం
అమ్మతో ఉంటేనే విలాసం!
అమ్మ సమక్షంలో మురుస్తుంది మానసం
అమ్మ ఉన్న చోటే సంతసపు ఆవాసం!
అమ్మతోటే మన మనోవికాసం
అమ్మ మన మొదటి సావాసం!
అమ్మ అండ కొండంత ఆకాశం
అమ్మ ఆశీస్సులు మనకు సర్వస్వం!

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

రావినూతల లక్ష్మీ అన్నపూర్ణ, ఆంగ్ల ఉపాధ్యాయిని, అంగలకుదురు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కొల్లిపర, న్యూస్‌టుడే : మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో కొల్లిపరలోని శ్రీజనార్దన స్వామి ఆలయం సమీపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సదస్సుకు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అధ్వాన పారిశుద్ధ్యంపై మంత్రి ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : పట్టణ మారీసుపేటలో మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం పర్యటించారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్య పునరావృతమైతే ఉపేక్షించేది లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను హెచ్చరించారు. మున్సిపల్ మార్కెట్ భవనంపై ఫ్లెక్సీలు కనిపించకూడదని కమిషనర్ శేషన్నకు సూచించారు. ప్రభుత్వ లేఔట్లలో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు గృహాలు నిర్మిస్తానని వార్డు సచివాలయ ఇంజినీరు వారి నగదు వసూలు చేసి తిరిగి ఇవ్వని విషయం తన దృష్టికి వచ్చిందని, లబ్ధిదారుల నుంచి ఫిర్యాదు తీసుకోవాలని డీఎస్పీ బి.జనార్దనరావుకు మంత్రి సూచించారు.

తీరు మారకుంటే చర్యలు తప్పవు



రౌడీ షీటర్ల వివరాలను ఆరా తీస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : రౌడీయిజాన్ని సహించేది లేదని, తీరు మారకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. ఆయన శనివారం తెనాలిలో రౌడీషీటర్లకు వారి నివాస గృహాల వద్దే కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి తనిఖీలకు వస్తానని చెప్పారు. డీఎస్పీ జనార్దనరావుతో పాటు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం

తెనాలి టౌన్ : బుర్రిపాలెంలోని శ్రీభూ సమేత లక్ష్మీనృసింహ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవం వైభవంగా కొనసాగుతుంది. శనివారం ఘట్టమనేని వారి సేవలో భాగంగా కృష్ణుడి అలంకరణలో స్వామి వారి పొన్నమాను వాహనంపై గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. వ్యవస్థాపక ధర్మకర్త వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

పొన్నూరు : పట్టణ పరిధిలోని సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు శ్రీకృష్ణుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పొన్నవృక్ష వాహనంపై ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగించారు.

తెనాలి (కొత్తపేట) : స్థానిక నాజర్‌పేటలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి జయంత్యుత్సవాలు శనివారం దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి బాధ్యుడు చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు

తెనాలి టౌన్ : మండల పరిధి కొలకలూరులో శ్రీగంగానమ్మ తల్లి దేవస్థాన 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకాగా, భారీ అన్నదానం చేశారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అనంతం.. అమ్మ అనురాగం

అంతర్జాతీయ మాతృ దినోత్సవం నేడు

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

పదాలు తెలియని పెదవులు పలికే తొలిమాట అమ్మ. ప్రతి ఒక్కరి తొలి గురువు అమ్మే. తల్లితోనే మనందరి జీవితం ఆరంభం. అమ్మ ప్రేమకు, అనురాగానికి అవధులు అనంతం. మనం ఏ స్థాయికి చేరినా, ఎక్కడ ఉన్నా పునాది అమ్మేనని గుర్తుంచుకొని తుది వరకు గౌరవంగా చూసుకుంటూ, ఆమెను సంతోషంగా ఉంచడం మనందరి బాధ్యత. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా మే 11న 'అంతర్జాతీయ మాతృ దినోత్సవం' నిర్వహించుకుంటున్నాం. ఇందులో భాగంగా అమ్మ ప్రోత్సాహంతోనే తమ ప్రగతి అంటున్న సాధకుల ప్రస్థానం తెలుసుకుందాం!

పునాదులు వేశారు



డిగ్రీ చదువుతున్న నేను తొలుత బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి క్రీడాకారిణిగా, గత మూడేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్‌గా పతకాలు సాధించానంటే అది అమ్మ నయోమి ప్రోత్సాహంతోనే. పాస్టర్‌గా ఉన్న అమ్మ నాకు ఇష్టమైన రంగాల్లో ముందుకు సాగేలా పునాదులు వేశారు. క్రీడా పోటీల సమయంలో ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, ఇతర దేశాలకూ వెళ్లాల్సి వచ్చినప్పుడు ఆమె నా వెన్నంటే ఉన్నారు. ఆర్థిక భారం గురించి ఆలోచన చేయలేదు. ఆమెకు మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నా వాటినీ పట్టించుకోలేదు. నేను పవర్‌లిఫ్టింగ్‌లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలని, సివిల్స్ సర్వీసెస్‌లో విజయం సాధించాలన్నది అమ్మ కోరిక. ఈ మేరకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను.

- మదిర షానూన్, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్

అదృష్టంగా భావిస్తున్నా..



నేను శాస్త్రీయ సంగీతంలో డిప్లమో చేసి సంగీత కళాశాల నిర్వహిస్తూ, మరోవైపు విజ్ఞాన్, వీవీఐటీల్లో యువతకు సంగీతం నేర్పిస్తున్నాను. 30 ఏళ్లుగా గురువుగా రాణిస్తున్నాను. ఇదంతా అమ్మ యల్లాప్రగడ జానకి చలువే. ఆమె 1970లోనే సంగీతంలో డిప్లమో చేశారు. ఆనాటి నుంచి నేడు ఏడు పదుల వయస్సులోనూ సంగీత కచేరీలు చేస్తున్నారు. నేను డిగ్రీ తర్వాత ఫ్యాషన్ డిజైనింగ్ చేశాను. కానీ చిన్నప్పటి నుంచి ఇంట్లో సంగీతం మధ్య పెరగడం, అమ్మ పాడిన పాటలను తిరిగి ఆలపించడంతో మొదలైన ప్రస్థానం నన్ను ఇలా నిలిపింది. నా చిన్నప్పుడు అమ్మకు ప్రభుత్వ సంగీత ఉపాధ్యాయినిగా ఉద్యోగం వచ్చినా, బదిలీల పేరిట ఇతర ఊర్లు తిరుగుతూ ఉంటే నన్ను చూసుకోవడం కుదరదని ఆమె దాన్ని వదులుకున్నారు. నా చదువుతో పాటు సంగీత ప్రస్థానం అంతా ఆమె పర్యవేక్షణలోనే సాగింది. అమ్మ దగ్గరే ఉండి ఆమెను చూసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. - నేరెళ్ల కల్యాణి, సంగీత గురువు

స్టీల్ స్టూళ్లు, సిమెంటు బల్లల వితరణ



దాతలకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఈవో లీలాకుమార్

పెదకాకాని, న్యూస్‌టుడే : స్థానిక మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కూర్చునేందుకు 10 సిమెంటు బల్లలను గ్రామానికి చెందిన బోయపాటి వెంకటరమణ అందించారు. గుంటూరులోని పీపుల్స్ ఆసుపత్రి వైద్యుడు కేసరి వెంకటేశ్వర రెడ్డి, వెంకట ప్రియాంక దంపతులు వారి కుమార్తె జాహ్నవి, కుమారుడు కౌశిక్‌లు భోజనశాలకు రూ.లక్ష విలువ చేసే 6 స్టీల్ టేబుల్స్, 30 స్టూళ్లు ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజల అనంతరం దాతలకు ఈవో గోగినేని లీలాకుమార్ స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.

సమాజాన్ని చైతన్యపరిచిన నాటికలు



కరెవరంలో..



పొన్నూరు: జనరల్ బోగీలు నాటికలోని సన్నివేశం

పొన్నూరు, న్యూస్‌టుడే : నిడుబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 24వ ఉభయ రాష్ట్రాల తెలుగు నాటిక పోటీలు ముగిశాయి. ఈ మేరకు శనివారం జనరల్ బోగీలు, కమనీయం నాటికలను ప్రదర్శించారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : మండలంలోని కరెవరంలో శ్రీగోపీ కృష్ణా ఫ్రెండ్స్ కళానికేతన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన 'సింహమంటి చిన్నోడు' సాంఘిక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గంపల శివనాగేశ్వరరావు దర్శకత్వం వహించిన నాటకంలో పలువురు కళాకారులు నటించారు. జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

భారత్ విజయం కోరుతూ పూజలు

తెనాలి టౌన్ : దేశ సరిహద్దుల్లో పాకిస్థాన్ దురాగతాలను అడ్డుకుంటూ భారత్ సైన్యం చేస్తున్న పోరులో విజయం సాధించాలని కోరుతూ కూటమి పార్టీల నాయకులు అంగలకుదురులోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కఠారి వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, కనగాల శ్రీనివాస్, వీరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు. నందివెలుగులోని శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో భాజపా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు, రామస్వామి తదితరులు పూజలు నిర్వహించారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధికారులు

పెదకాకాని : నంబూరులోని వీవీఐటీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం శనివారంతో ముగిసినట్లు బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్ తెలిపారు. ఈ శిబిరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన సాహస విన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీల్లో గెలుపొందిన క్యాడెట్లకు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ అధికారిణి డాక్టర్ ఎ.శ్రీవాణి పాల్గొన్నారు.

అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం



మహిళకు మందులు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

చేబ్రోలు : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు శనక్కాయల రాజకుమారి అన్నారు. మండల పరిధి వేజండ్లలోని కృష్ణ మందిరం వద్ద శనివారం అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. వైద్యులు శిరీష, సిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తిష్ఠ.. స్పందించకుంటే ఎట్లా?

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణ బస్టాండ్, గంగానమ్మపేట, ఉప్పుబజారు ప్రాంతాల్లోని వార్డుల్లో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ ఏరియాల్లో సుమారు 12 వేల మంది పైగా జనాభా నివసిస్తున్నారు. వీరు ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించిన దాఖలాలు లేవు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా కాలువలను శుభ్రం చేయించారు. ఆ తర్వాత వాటిని పట్టించుకున్న వారే కరవయ్యారు.



టెండర్ ఖరారైనా వేయని గంగానమ్మపేట రోడ్డు



ఆర్టీసీ అద్దె దుకాణదారు రహదారి ఆక్రమణ

డిమాండ్ నోటీసులు పంపించారని..

పలుమార్లు గంగానమ్మపేట, ఉప్పు బజారులోని రోడ్లు, కాలువల నిర్మాణానికి టెండర్లు పిలిచి ఎంపిక చేసినా గుత్తేదారులు వేయకుండా జాప్యం చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కుళాయిల ద్వారా ఇంటింటికి నీరు ఇవ్వకుండా నీటి పన్ను చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపించారని కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినా మొత్తం పన్ను చెల్లించాలన్నారు. బస్టాండ్, గంగానమ్మపేట, ఉప్పుబజారు, టూటౌన్ పోలీసు స్టేషన్ రోడ్డుపై వాహనాల మరమ్మతులు, పార్కింగ్, ఆక్రమణలతో రాకపోకలకు అసౌకర్యంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అమ్మకాలు చేయడంతో..

బస్టాండ్ బయట ఉన్న మూత్రశాల నిర్వహణ సరిగా ఉండడం లేదని, దాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వినియోగదారుల నుంచి రుసుము వసూలు చేసే విధానం తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు. గోపాల్ రెడ్డి వీధిలోని రోడ్డుపై నిర్మాణ సామగ్రి ఉండటంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వీధి కుక్కలు వెంట పడుతున్నాయని కమిషనర్‌కు తెలిపినప్పుడు స్పందించక పోవడంతో అవి కరిచాయని జనం చెప్పి వాపోయారు. గాడిబావి సెంటర్‌లోని ఆక్రమణలతో మున్సిపాలిటీ రోడ్డు కుచించుకు పోయింది. మున్సిపల్ అధికారులు మార్కింగ్ ఇచ్చిన చోట కాకుండా వేరే చోట వీధి వ్యాపారులు అమ్మకాలు చేయడంతో పాదచారులు నడవడానికి ఖాళీ లేక ఇబ్బంది పడుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బీటెక్ చదువుతున్న యువకుడు పట్టణ పరిధి ఓ కాలనీలోని తమ నివాసంలో శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఆన్‌లైన్ జూదం వల్ల ఆర్థికంగా నష్టపోయినందున, కుటుంబ సభ్యులు మందలించిన క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుందని సమాచారం. అయితే తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలో మరో బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం వెనుక ఇదే తరహా కారణం ఉందన్న అంశం చర్చనీయాంశమైంది.

క్రైమ్ కార్నర్

వ్యభిచార నిర్వాహకుల అరెస్ట్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వ్యభిచారం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాశరావు స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లో శనివారం వారు మాట్లాడుతూ పట్టణ పాండురంగపేట, చెంచుపేటలో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న విజయలక్ష్మి, నగీనా, గఫూర్, దర్గారెడ్డి, హిమబిందు, విటులు ప్రతాప్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ముగ్గురు మహిళలను మహిళా సదనానికి పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన వ్యభిచార గృహ నిర్వాహకుల్లో పలువురిపై గతంలోనూ కేసులు ఉన్నాయన్నారు

నాలుగు ఎకరాల్లోని మొక్కజొన్న పంట దగ్ధం

చేబ్రోలు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన శలపాడులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన రామారావు అనే రైతు నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకుంది. స్థానికుల సమాచారం మేరకు తెనాలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.2.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

అంధకారంలో వైద్య సేవలు

తెనాలి(కొత్తపేట): పట్టణంలో విద్యుత్తు మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ అధికారులు ముందుగా ప్రకటించినా తెనాలి జిల్లా ఆసుపత్రి అధికారులు అప్రమత్తంగా లేకపోవడంతో రోగులు శనివారం ఇబ్బంది పడ్డారు. దీంతో వైద్యులు పాత భవనంలో అంధకారంలోనే రోగుల ఇబ్బందులు తెలుసుకొని మందులు రాసి ఇచ్చారు. ఓపీ సిబ్బంది కంప్యూటర్‌లో రసీదులు రావని చేతితో రాసి రోగులకు అందజేశారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

బాధితులకు అండగా ప్రభుత్వం


సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న తెదేపా గ్రామ అధ్యక్షులు పిచ్చియ్య తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను తాడేపల్లి మండలం ఇప్పటంలో శనివారం గ్రామ పార్టీ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చియ్య పంపిణీ చేశారు. బాధితుల ఇళ్లకు వెళ్లి గ్రామ నాయకులతో కలసి బాధితులకు అందించారు. చిట్టెమ్మకు రూ.35,947, పాండుకు రూ.3,45,547, భాగ్యలక్ష్మికి రూ.59,786 నగదు చెక్కులను అందజేశారు. నాయకులు రత్తయ్య, కొండయ్య, రాంబాబు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేతన్నను గౌరవిద్దాం..రండి

✤ మంగళగిరిలో 3కే రన్ నేడు

మంగళగిరి, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతిని రక్షించే నేతన్నను గౌరవిస్తూ మంగళగిరిలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా 3కే రన్ నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఎన్నారై జంక్షన్ నుంచి కార్యక్రమం ప్రారంభమై.. గౌతమబుద్ధా రోడ్డులోని బస్‌స్టాండ్ కూడలి వరకు సాగుతుంది. రాత్రి 7:30గంటలకు మంగళగిరి చేనేత మగ్గాలపై తయారైన నేత వస్త్రాలతో మహిళల ఫ్యాషన్ షో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రీతి ఆధ్వర్యాన డీజే ఉంటుంది. మంగళగిరిలో చేనేత వీవర్స్‌శాల, నేతన్నలకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సినీ కథానాయిక అనన్య నాగళ్ల పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామంలో లోవోల్టేజ్ సమస్య అధికంగా ఉంది. రాత్రి వేళల్లో విద్యుత్తు సరఫరా సరిలేక ఇళ్లలో ఉపకరణాలు పాడవుతున్నాయి. జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ నాగమల్లేశ్వరరావు మరమ్మతులు చేయించారు.

✤ పొన్నెకల్లు గ్రామ శివారు మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి జానీ జేసీబీ సహాయంతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

తాడేపల్లి, న్యూస్‌టుడే

? తాడేపల్లి గణేష్ కళామందిరం వద్ద భవన నిర్మాణదారులు కాలువలో అడ్డుగా బిల్డింగ్ మెటీరియల్ వేశారు. మురుగు రోడ్డుపై తిష్ఠ వేస్తోంది. **-నాగార్జున, తాడేపల్లి**

✔ సమస్యను పరిశీలించి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. **- అలీంబాషా, కమిషనర్, నగరపాలక సంస్థ, మంగళగిరి**

రేషన్ బియ్యం పట్టివేత

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమనిలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు శనివారం రాత్రి పోలీసులు తెలిపారు. ఈ విషయమై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరవి చెప్పారు.

ధ్వజ స్తంభానికి పూజలు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ముట్లూరు గ్రామంలో శ్రీగంగా పర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం ముందు ప్రతిష్ఠించేందుకు తెచ్చిన ధ్వజ స్తంభాన్ని భక్తులు శుక్రవారం ఊరేగించారు. భక్తులు వారలు పోస్తూ పూజలు చేశారు. స్వామివారి దేవాలయం ముందు ఇటీవల వీచిన గాలుల తీవ్రతకు ధ్వజ స్తంభం కూలిపోవడంతో భక్తులు అందించిన విరాళాలు రూ.3 లక్షల ఖర్చుతో కొత్తదాన్ని తయారు చేయించారు. త్వరలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించనున్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

తాడేపల్లి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు స్థానిక యువకులతో కలసి అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ గ్రామీణ విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. సీఐ జి.వీరాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

చదువుల గని.. విలువల మణి

పాలపర్రు ఉన్నత పాఠశాల వజ్రోత్సవానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు


మాజీ సైనిక ఉద్యోగులను సత్కరించిన విశ్రాంత డీజీపీ మాలకొండయ్య తదితరులు

పాలపర్రు (పెదనందిపాడు), న్యూస్‌టుడే

పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాల వేడుక (వజ్రోత్సవం) శనివారం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. పాఠశాలలో చదివి సైనిక విభాగాలలో పనిచేసి దేశానికి సేవలందించిన మాజీ సైనికోద్యోగులను ఘనంగా సత్కరించారు. గుత్తికొండ యామలయ్య, పోపూరి రమేష్‌రాయ్ (ఎయిర్ ఫోర్స్), పెంట్యాల శ్రీధరబాబు, సుఖవాసి లక్ష్మీనారాయణ, అన్నలదాస్ శాంతయ్య, దార్నాసి సంగీతరావు (ఆర్మీ) లను శనివారం ఆ పాఠశాల వజ్రోత్సవం పురస్కరించుకుని విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, విశ్రాంత అదనపు ఎస్పీ కాళహస్తి సత్యనారాయలు తదితరులు వారిని సత్కరించి సేవలను కొనియాడారు.

మాతృ సంస్థపై అభిమానంతో వచ్చా



నాకు ఆరోగ్యం సక్రమంగా లేకపోయిన చదివిన మాతృసంస్థపై అభిమానంతో వజ్రోత్సవ వేడుకలకు వచ్చాను. ఎంతో సంతోషంగా ఉంది. 6వ తరగతి నుంచి ఈ పాఠశాలలో చదివాను. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వయోజన విద్యావిభాగంలో ఆచార్యుడిగా పనిచేసి రిటైర్ అయ్యాను. ఈ పాఠశాల అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందిస్తా.

– ఎం. కోటేశ్వరరావు, తెనాలి

అభివృద్ధికి పునాదులు..



నా అభివృద్ధికి పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పునాదులు వేసింది. ప్రతిరోజు 5 కిలోమీటర్లు నడిచి వచ్చి ఈ పాఠశాలలో చదువుకున్నాను. వజ్రోత్సవ వేడుకల్లో పాత మిత్రులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ శాఖలో అదనపు కమిషనర్ గా పనిచేసి రిటైర్ అయ్యాను.

– బి. రవీంద్రనాథ్, తన్నీరువారిపాలెం

జీవితంపై నమ్మకం కలిగించింది..



నేను ఈ పాఠశాలలో 1962-69 వరకు చదువుకున్నాను. ఇక్కడే జీవితానికి నమ్మకం ఏర్పడింది. భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన పాఠశాలను ఎన్నటికి మరువలేను. నా భర్త సుభాష్‌చంద్రబోస్ ఇదే పాఠశాలలో చదివి.. ఐఐటీ ఆచార్యునిగా ఉద్యోగ విరమణ చేశారు. – ఎం. విజయలక్ష్మి, గుంటూరు

ఆడపిల్లలు చదువుకోగలిగారు ..



మా గ్రామంలో ఈ పాఠశాల లేకపోతే చదువుకునేందుకు వీలుండేది కాదు. ఆడపిల్లలు చదువుకునేందుకు వీలు కల్పించిన దాత ముద్దన చెంచయ్య ఎంతో మహనీయుడు. నేను ఈ పాఠశాలలో 1977-78 లో పదోతరగతి పాస్ అయ్యాను. ఆ తరువాత డిగ్రీ, ఇతర చదువులు చదివి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం పొంది 37 ఏళ్లు పనిచేశాను. – టి. వినోద, గుంటూరు

ఆరాధనోత్సవాలు ప్రారంభం

లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: లేమల్లెపాడు గ్రామంలో శ్రీవరాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి ఆరాధనోత్సవాలు శనివారం ప్రారంభం అయ్యాయి. ప్రత్యేక పూజల అనంతరం పతాకం ఆవిష్కరణ జరిగింది. 11న గ్రామ ప్రభ ప్రదర్శన, 12న స్వామివారి కల్యాణం, సర్పహోమం, శాంతిపూజలు, తెప్పోత్సవం, పవళింపు సేవలు నిర్వహించనున్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే : నిడుబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 24వ ఉభయ రాష్ట్రాల తెలుగు నాటిక పోటీలు ముగిశాయి. ఈ మేరకు శనివారం జనరల్ బోగీలు, కమనీయం నాటికలను ప్రదర్శించారు.

సమాజాన్ని చైతన్య పరిచిన నాటికలు


కరెవరంలో..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : మండలంలోని కరెవరంలో శ్రీగోపీ కృష్ణా ఫ్రెండ్స్ కళానికేతన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన 'సింహమంటి చిన్నోడు' సాంఘిక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గంపల శివనాగేశ్వరరావు దర్శకత్వం వహించిన నాటకంలో పలువురు కళాకారులు నటించారు. జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

యువత సన్మార్గంలో నడవాలి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న అబద్దయ్య, నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: యువతను సన్మార్గంలో నడిపేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. శనివారం దుగ్గిరాల తారకరత్న అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. వరుసగా మూడో సంవత్సరం ఈ పోటీలు నిర్వహిస్తున్న తారకరామ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల నుంచి యువతను దారి మళ్లించేందుకు లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. క్రికెట్ టోర్నీలో మొత్తం 60 టీమ్‌లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్లకు తొలుత నివాళులర్పించారు. ఎంపీపీ షేక్ జబీన్, మంగళగిరి, దుగ్గిరాల మార్కెట్ కమిటీల ఛైర్మన్లు, ఎంపీటీసీ జవ్వాది కిరణ్‌చంద్, సర్పంచి బాణావత్ కుషీబాయి, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, అసోసియేషన్ సభ్యులు వల్లూరు నరసింహారావు, నక్కా చిరంజీవి, గద్దె వాసు, దేవరపల్లి మహేష్, వాసిరెడ్డి వినోద్, హర్ష, పాటిబండ్ల కృష్ణప్రసాద్, సురేష్ తదితరులున్నారు.

దేశ క్షేమం కోసం ప్రత్యేక పూజలు


మేడికొండూరు: పూజలో భాజపా నాయకులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు వేణుగోపాల స్వామి దేవస్థానంలో శనివారం భాజపా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి ప్రతీకగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేశ ప్రజలు, సైనికులు క్షేమంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బాషా, చల్లా రోశిరెడ్డి, జిక్రియ, కొల్లి మర్ల శ్రీనివాసరావు, ధనుంజయ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'ఆపరేషన్ సిందూర్'లో భారత సైన్యం విజయం సాధించాలని శనివారం జిల్లా భాజపా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో రాజధాని గ్రామం అనంతవరంలో భాజపా నాయకులు వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరిపతి ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామంలో కొండపైన శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వయంభూగా వెలసిన శ్రీవారి ఆలయానికి చేరుకుని కొబ్బరికాయలు కొట్టారు. నాయకులు ఆర్టిజన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ కొళ్ళపూడి హేమ సుందర్, భజరంగ్ దళ్ రామకృష్ణ, మార్త నరేంద్ర, తనీరుకొండ లక్ష్మీనారాయణ, కంతేటి బ్రహ్మయ్య, దండే కిషోర్, సరిపూడి సాంబశివరావు, పరుచూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


నినాదాలు చేస్తున్న కార్మికులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ శనివారం మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసనల్లో పాల్గొన్న ఆ సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరగనున్న కార్మికుల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే వేతనాల చెల్లింపు చట్టం, బోనస్ చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం చట్టం రద్దవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రత్నకుమారి, మార్తమ్మ, ఆశా, బాలమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం

పెదకాకాని : నంబూరులోని వీవీఐటీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం శనివారంతో ముగిసినట్లు బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్ తెలిపారు. ఈ శిబిరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన సాహస విన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీల్లో గెలుపొందిన క్యాడెట్లకు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ అధికారిణి డాక్టర్ ఎ.శ్రీవాణి పాల్గొన్నారు.

తెలిస్తే సారం.. తగ్గెను భారం

మందకొడిగా సాగుతున్న మట్టి నమూనాల సేకరణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

తొలకరి జల్లులు పడితే ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు జూన్ నెలాఖరులో ప్రారంభం కానుంది. ఈలోపే భూసార పరీక్షలను పూర్తి చేసి రైతులకు తగు సూచనలు తెలియజేయాల్సి ఉంది. వ్యవసాయ శాఖ గత నెల 15కు ముందే మండలాల వారీగా సేకరించాల్సిన భూసార పరీక్షల లక్ష్యాలను నిర్దేశించింది. ఆ మేరకు ఆయా మండలంలో ఎన్ని నమూనాలను సేకరించాలో..తెలియజేస్తూ మండల వ్యవసాయాధికారికి ఆదేశాలు జారీ చేసింది. కానీ 25 రోజుల గడిచినా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇంకా భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ జరుగుతూనే ఉంది. లక్ష్యం మేరకు నమూనాలను సేకరించిన తర్వాతనే ల్యాబ్‌ను పంపుతారు. ఇదే ఆలస్యం కొనసాగితే భూసార పరీక్షల ఫలితాల వెల్లడి జాప్యమై రైతులు పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

మండలాల వారీగా ఇలా..

మండలం	లక్ష్యం	సేకరించిన నమూనాలు
ప్రత్తిపాడు	840	400
పెదనందిపాడు	480	250
వట్టిచెరుకూరు	825	325
గ్రామీణ గుంటూరు	520	280
కాకుమాను	1150	300


ప్రత్తిపాడు: నమూనాలను సేకరిస్తున్న ఏవో అరుణ కుమారి తదితరులు

నేల స్వభావం తెలిస్తేనే ప్రయోజనం..

భూసార పరీక్షలతో నేల స్వభావం తెలుసుకోవచ్చు. ఆ నేలకు అనుకూలమైన పంటను వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నేలలో పోషక పదార్థాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఫలితాలతో ఎరువులను కావాల్సిన మేర వాడి ఖర్చు తగ్గించుకుని నికర ఆదాయం పొందవచ్చు.

లక్ష్యాలను త్వరలోనే చేరుకుంటాం..

భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ చేపడుతున్నాం. రైతు సేవా కేంద్రం సిబ్బంది సెలవుల్లో ఉండటం కారణంగా జాప్యం జరుగుతున్నది. త్వరలోనే లక్ష్యం మేరకు నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపుతాం.

– కె.అరుణ కుమారి, మండల వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు.

దారి..నరకంగా మారి

గ్రామీణ గుంటూరు మండలం చల్లావారిపాలెం నుంచి వెంగళాయపాలెం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రాళ్లు లేచి, గుంతలు పడ్డాయి. వాహనాల రాకపోకల సమయంలో మట్టి, దుమ్ము లేచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నివాసాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఈ సమస్యతో సతమతమవుతున్నమని సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


- న్యూస్‌టుడే, చల్లావారి పాలెం(ప్రత్తిపాడు)


చల్లావారిపాలెం నుంచి వెంగళాయపాలెం రోడ్డులో అధ్వానంగా రోడ్డు

నత్తనడకన ట్యాంకు నిర్మాణం

ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మిస్తున్న నీటి ట్యాంకు నిర్మాణ పనులు గత రెండేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్నాయి. గ్రామంలో ఒక నీటి ట్యాంకు ఉండటంతో మరోక ట్యాంకు నిర్మాణానికి వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కావడంతో నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి పనులు సక్రమంగా జరగడం లేదు. ఎప్పటికీ నిర్మాణ పనులు పూర్తి అవుతుందా..అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

-న్యూస్‌టుడే, పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు)



పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీ


తుళ్లూరు-2 పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న శ్రావణ్ బాబు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తుళ్లూరు-2, అనంతవరం సచివాలయం పీహెచ్‌సీలను శనివారం జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇమ్యూనైజేషన్ అధికారి ఏ.శ్రావణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఫీల్డ్ రికార్డులు, సీడీ, ఎన్‌సీడీ సర్వే, పీఎంఎంజేవై సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్, ఎనాఫలాక్సిస్ కిట్‌లను పరిశీలించి, అందుబాటులో ఉన్న నిల్వలపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో ఉదయం 11 గంటల లోపే వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ సూపర్ వైజర్ వీఎస్ఆర్ శాస్త్రి, సీహెచ్‌వో వెంకట రమణ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.కె కరీం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు'

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామాల్లో రహదారుల పక్కన తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని తుళ్లూరు మండలం తెదేపా అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు సీఆర్‌డీఏ అధికారులను కోరారు. శనివారం తుళ్లూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి నిర్మాణ పనుల కోసం వేల సంఖ్యలో కార్మికులు రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న పేదలు రహదారుల పక్కన తాగు నీరు, కూల్‌డ్రింక్‌లు, కూరగాయలు, టీ కొట్లు, అల్పాహార హోటళ్లు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన సమయంలో వారందరినీ వెంటనే ఖాళీ చేయించవచ్చని, తాత్కాలికంగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి వెసులుబాటు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాటా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరాయ.. గౌరీవరదాయ..


దుగ్గిరాల శివాలయంలో స్వామి వారి కల్యాణం


పెదనందిపాడు: అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి


ప్రత్తిపాడులో..

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక శివాలయంలో శనివారం రాత్రి గంగా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు నాగేశ్వరం యుగంధర్ పవిత్రవేద మంత్రాలు పఠిస్తుండగా వాసిరెడ్డి సుధాకర్-పద్మ దంపతులు కల్యాణ క్రతువు నిర్వహించారు. తొలుత స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు.

శ్రీరామదూతం..శిరసానమామి

పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: పాతమల్లాయపాలెంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు నరేశ్ కుమార్ చెప్పారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం గరుడ, పుష్ప, పొన్నమాను వాహనసేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నారసింహుడికి పూజలు

కొప్పర్రు (పెదనందిపాడు,) న్యూస్‌టుడే: లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా సోమవారం పెదనందిపాడు మండలం కొప్పర్రులో ఆ స్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చి దీపారాధనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభలను మేళతాళాలతో గ్రామ ప్రధాన వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: నాగులపాడు గ్రామంలో బొడ్డురాయి (సీతలమ్మ తల్లి) వార్షికోత్సవం సందర్భంగా శనివారం దంపతులు విశేష పూజలు, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

గణపతి పెండ్లి కుమారుడాయే..



గోగులమూడి(పెదనందిపాడు) న్యూస్‌టుడే: గోగులమూడి లోని సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని కృష్ణారావు దంపతుల ఆధ్వర్యంలో అర్చకుడు గురునాథ్‌శర్మ కనులపండువగా చేయించారు. తొలుత విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాడి రంగం అభివృద్ధికి చేయూత

రాయితీపై పశువుల దాణా అందజేత


దుగ్గిరాల: పెదపాలెంలో దాణా పంపిణీ చేస్తున్న సర్పంచి కృష్ణప్రసాద్, డాక్టర్ సురేష్

ఫిరంగిపురం గ్రామీణం, తాడికొండ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాడి రంగం పడకేసింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లు పశుపోషకులకు ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం పాడి రంగం అభివృద్ధికి కృషి చేస్తుంది. పశుపోషకులను ప్రోత్సహిస్తూ అనేక పథకాలు అమలు చేస్తుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం రాయితీ ద్వారా దాణా కట్టలు అందిస్తోంది. తెల్లరేషన్ కార్డు దారులు అర్హులని సూచించింది. అర్హత కలిగిన రైతులందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటించారు. 50 శాతం రాయితీతో దాణా అందిస్తున్నట్లు పేర్కొంది. ఒక్క తాడికొండ నియోజకవర్గానికి 25 మెట్రిక్ టన్నులు దాణా కేటాయించారు. తాడికొండ, పొన్నెకల్లు, రావెల, ఫిరంగిపురం, నుదురుపాడు మొత్తం 5 పశువుల ఆసుపత్రులను ఎంపిక చేశారు. వాటిల్లో ఒక్కో దానికి 5 టన్నులు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. 50 కేజీల బరువు గల రూ.1,100 విలువ చేసే ఒక్కో దాణా కట్ట రాయితీ ద్వారా రూ.550 రూపాయలకే అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆయా ఆసుపత్రుల పరిధిలోని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

★ ప్రభుత్వం దీనికి ముందు గోకులం షెడ్డులు ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఒక్కో దానికి లక్షలు కేటాయించింది. దీనికి తోడు వేసవి దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తుంది. ఈ విధంగా పాడి రంగం అభివృద్ధికి కృషి చేస్తుంది.

పెదపాలెం(దుగ్గిరాల), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై పశువుల దాణా ఇస్తోందని పెదపాలెం పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. శనివారం పెదపాలెం ఆస్పత్రిలో సర్పంచి పాటిబండ్ల కృష్ణప్రసాద్‌తో కలిసి 86 మంది రైతులకు 100 బస్తాలు పంపిణీ చేశారు.

గుంటూరు తూర్పు

రేపు వెల్‌నెస్ సెంటర్‌కు సెలవు

పట్నంబజారు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు వైద్య సేవలు అందించే సిజిహెచ్‌ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్‌నెస్ సెంటర్‌కు బుద్ధ పూర్ణిమ సందర్భంగా సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించిందని గుంటూరు సిజిహెచ్‌ఎస్ ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని సిజిహెచ్‌ఎస్ కార్డు హోల్డర్లు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం రావద్దని సూచించారు.



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 16, బెండ 20, పచ్చిమిర్చి 25, కాకర 34, క్యారెట్ 27, క్యాబేజీ 17, బీర 20, దొండ 18, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 18, గోరుచిక్కుళ్లు 30, దోస 18, పొట్ల 22, పెద్ద చిక్కుళ్లు 50, చామ దుంప 44, మునగ 7, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 25, బీట్‌రూట్ 28, కీర 39, క్యాప్సికం 55, అల్లం 40, ఫ్రెంచి బీన్స్ 80, సొర 14, అరటి 7.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

94406 38515, 80085 73097

? పాతగుంటూరు అంకమ్మతల్లి గుడి సెంటర్లో రోడ్డుకు ఇరు వైపులా ఆటోలు నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులొస్తున్నాయి. **- మస్తాన్, ఆనందపేట**

✔ రహదారులపై ఆటోలు నిలిపివేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. **- సోమయ్య, పాతగుంటూరు సి.ఐ.**

? మాచిరాజువారివీధిలో దాదాపు నాలుగు నెలల కిందట రోడ్డు నిర్మాణం కోసం తవ్వేశారు. రోజులు గడుస్తున్నా పనులు పూర్తి చేయటం లేదు. **- అంకిత్, శివాలయంవీధి**

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం. **- వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ ఏ.ఈ.**

? పాతగుంటూరు మణిహోటల్ సెంటర్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. కాలువల్లో మురుగునీరు ముందుకెళ్లడం లేదు. దుర్వాసన కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- బ్రహ్మం, లక్ష్మీనగర్**

✔ కాలువల్లో పూడిక తీసి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. **- రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

- న్యూస్‌టుడే, పట్నంబజారు

స్పందనకు వందనం

❖ పొన్నూరు రోడ్డు సాయినగర్ ప్రధాన రోడ్డులో రెండ్రోజులుగా చెత్తకుప్పలు అలాగే వదిలేశారు. వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయని స్థానికులు శ్యామ్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు.

❖ తారకరామనగర్ మూడోలైన్‌లో సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు ముందుకు కదలక దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు రవి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో పూడికలు తీయించారు.

❖ అరుంధతినగర్ రెండోలైన్ కాలువల్లో చెత్త పడటంతో మురుగునీరు నిలిచిపోయిందని స్థానికులు మల్లిక్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయటంతో పూడికలు తీయించారు.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)

అపరిశుభ్రత.. భరించలేని దుర్గంధం

న్యూస్‌టుడే - నగరపాలకసంస్థ (గుంటూరు)

ఇదీ వెన్‌లాక్ మార్కెట్ పరిస్థితి

జీఎంసీ కార్యాలయానికి వెనుక వైపునే ఉన్న వెన్‌లాక్ చేపలు, మాంసం మార్కెట్ అపరిశుభ్రతకు చిరునామాగా ఉంది. ఇక్కడ స్వచ్ఛత గురించి ప్రజారోగ్య విభాగం అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. నగరంలో మెరుగైన పారిశుధ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారేగానీ చేపల మార్కెట్‌ను మాత్రం వదిలేశారు. వెన్‌లాక్ మార్కెట్ భవన నిర్మాణంలోనే ఇంజినీరింగ్ లోపాలతో అనేక సమస్యలున్నాయని ఏళ్లుగా అధికారులు చెప్పడమేగానీ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారు. మార్కెట్‌లో నిర్మించిన సెల్లార్, డ్రెయినేజీ వ్యవస్థ, దుకాణాల డిజైన్‌లో లోపాలతో ఇక్కడ చాలా వరకు ఖాళీగానే ఉంటున్నాయి. వెన్‌లాక్ మార్కెట్‌లో మొత్తం 250కిపైగా దుకాణాలు ఉండగా వీటిలో కొన్నింటిలోనే వ్యాపారాలు నడుస్తున్నాయి.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ.. : మార్కెట్‌కు నిత్యం రేపల్లె, బాపట్ల, ఇతర డెల్టా ప్రాంతాల నుంచి చేపలు, రొయ్యలు వస్తుంటాయి. వీటితోపాటు చికెన్, మటన్ దుకాణాలు కలిపి మొత్తం 120 వరకు ఉన్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీరు పారుదలకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. నీరంతా సెల్లార్‌లోనే నిలిచిపోతోంది. భరించలేని దుర్గంధం వ్యాపిస్తోంది. ఇది భరించలేక జీఎంసీ కార్యాలయ భవనంలో మార్కెట్‌వైపు ఉన్న కిటికీలు, తలుపులు కనీసం తెరవలేని పరిస్థితి. ఇక్కడ వ్యాపారాలు నిర్వహించలేక కొందరు మార్కెట్ పక్కనున్న రహదారి మార్జిన్‌లో దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్యలొస్తున్నాయి.

ఇలా చేస్తే ఉపయోగకరం.. : సమస్యల పరిష్కారానికి వెన్‌లాక్ చేపలు, మాంసం మార్కెట్‌ను పొన్నూరు రోడ్డులోని ప్రభుత్వ ఖాళీస్థలంలోకి తరలించేందుకు గతంలో ప్రతిపాదించారు. ఇది అమలుకు నోచుకోలేదు. మార్కెట్‌ను తరలించేంత వరకు ఇక్కడ మౌలిక సదుపాయాల మెరుగుకు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేసి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇంజినీరింగ్ లోపాలు సవరించి మిగిలిన దుకాణాలు వినియోగంలోకి వచ్చేలా చూడాలి.


వెన్‌లాక్ మార్కెట్‌లో చేపల విక్రయాలు

వీధి దీపం వెలిగించారు

ఈనాడు కథనానికి స్పందన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీకాలనీ ఎక్స్‌టెన్షన్ గాంధీనగర్ 3వ వీధిలో విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం పాడైపోవడంతో స్థానికులు చీకట్లో ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 3న 'వెలగని వీధి దీపం' శీర్షికతో 'ఈనాడు' వెలుగులోకి తీసుకురాగా స్పందించిన అధికారులు మరమ్మతులు చేయించి వెలిగించారు.

అలరించిన కీర్తనల గానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ స్మృత్యంజలి కీర్తనల గానం శనివారం రాత్రి జరిగింది. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతలపాటి రమాగోపాలకృష్ణ, పావని, నాగలక్ష్మి అన్నమాచార్య విరచిత కీర్తనల గానం చేశారు.

ఏసీ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

నగరంపాలెం, న్యూస్‌టుడే: ఆంధ్రక్రైస్తవ (ఏసీ) కళాశాలలో 1987-90 విద్యాసంవత్సరంలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాలలోని జేడీ శీలం సమావేశ మందిరంలో శనివారం ఘనంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున సమ్మేళనానికి హాజరై ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలుకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు చదువు చెప్పిన అధ్యాపకులను సమ్మేళనానికి ఆహ్వానించారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్స్ ఆండ్రూస్, పి.ముత్యం, బి.రత్నం, రాధాకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్స్ శారద, రాజ్యలక్ష్మిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.


మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి, మాదక ద్రవ్యాలు వినియోగించినా.. అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ గుంటూరు-2 స్టేషన్ సీఐ యశోదరదేవి హెచ్చరించారు. శనివారం స్వర్ణభారతినగర్‌లో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఎస్ మారయ్యబాబు, ఎస్సై మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ గుంటూరు-2 స్టేషన్ సీఐ యశోదరదేవి, ఏఈఎస్ మారయ్యబాబు, ఎస్సై మాధవి

ఆ పాఠశాలలకు పోస్టులు పెంచాలి

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: గత ఏప్రిల్‌లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినందున విద్యార్థుల సంఖ్య పెరిగిందని, అలాంటి బడులకు పోస్టులు అదనంగా కేటాయించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) నాయకులు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజును కోరారు. శనివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ హేతుబద్ధీకరణకు కటాఫ్ ఏప్రిల్ నెలాఖరు వరకు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:40గా తీసుకోవాలన్నారు. భాషా పండిట్, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ పదోన్నతులు కల్పించాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు ఉన్నారు.


పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఎన్టీఏ నాయకులు

రోడ్డు దాటేదెలా?

నగర ప్రధాన రహదారులు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. మార్కెట్ సెంటర్, బస్టాండు సెంటర్, స్టేడియం సెంటర్, నాజ్ సెంటర్లలో పాదచారులు రోడ్డు దాటేందుకు అధికారులు జీబ్రా లైన్లు ఏర్పాటు చేయటం లేదు. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం జిల్లాకు వచ్చే వారు ఎక్కువడటంతో ఇక్కడ రోడ్డు దాటుతున్నారు. శరవేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని గాయాలపాలవుతున్నారు. ఇటీవల మార్కెట్ సెంటర్లో రోడ్డు దాటుతున్న అభిరాం అనే యువకుడిని ఆటో ఢీ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా స్పందించి అన్ని రహదారుల్లో జీబ్రా లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, పట్నంబజారు


బస్టాండు సెంటర్లో చెరిగిపోయిన జీబ్రా లైన్ల వైపు నుంచి రోడ్డు దాటుతున్న పాదచారులు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నేడు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖకు చెందిన ఆర్.అగ్రహారంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 11న నరసింహస్వామి జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి 7 గంటలకు శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొనాలని ఆలయ ఈవో ఆంజనేయాచార్యులు కోరారు.


కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయం

జవాన్ మురళీనాయక్‌కు నివాళి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేశ సరిహద్దులో పాకిస్థాన్ సైనికుల ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ సేవలు మరువలేనివని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. శనివారం కొత్తపేటలోని కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు హనుమంతరావు, అంజిబాబు, అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, సురేష్‌బాబు, శివాజీ, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: సైనికుడు మురళీ నాయక్ పోరాటాన్ని యావత్ భారతావని ఎప్పటికీ మరచిపోదని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. * ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.29 లక్షల సంబంధించిన చెక్కుల్ని 12 మందికి ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పంపిణీ చేశారు.


మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

పట్నంబజారు, న్యూస్‌టుడే: దేశ రక్షణలో అశువులు బాసిన వీర జవాన్ మురళి నాయక్ సేవలు ఎనలేనివని ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కరీం అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో శనివారం మురళి నాయక్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కరీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మురళి నాయక్ సేవల్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం తన ప్రాణాల్ని అడ్డుపెట్టి పోరాడిన మహోన్నత వ్యక్తి మురళి నాయక్ అన్నారు. కార్యక్రమంలో జాన్‌బాబు, సుధీర్‌బాబు, రెహమాన్ పాల్గొన్నారు.


ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో..

లీకేజీలు అరికట్టండి

న్యూస్‌టుడే - నెహ్రూనగర్


అయ్యప్పస్వామి ఆలయం వద్ద కాలువలోకి వృథాగా మంచినీరు

నెహ్రూనగర్ నుంచి చేనేతకాలనీ, న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి తాగునీటి పైపులు లీకవుతున్నాయి. అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో, కరెంట్ కార్యాలయం ఎదురుగా, చేనేతకాలనీకి వెళ్లే మార్గాల్లో రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి గుంటూరు పశ్చిమకు తాగునీరు సరఫరా చేసే భారీ పైపులు ఈ మార్గంలో ఉన్నాయి. వీటికి లీకులు ఏర్పడి రోజుల తరబడి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగా రహదారులు సైతం పాడైపోతున్నాయి. వేసవిలో అనేక ప్రాంతాల్లో అవసరాలకు సరిపడా నీరు లేక జనం ఇబ్బంది పడుతున్నారు. ఉన్న నీటిని సద్వినియోగం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్యను జీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఆ మార్గంలో ప్రధాన పైపులైను ఉండడంతో నగరంలో తాగునీటి సరఫరా నిలిపేసి మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చేనేత కాలనీకి వెళ్లే మార్గంలో...

14న జాబ్‌మేళాను జయప్రదం చేయాలి


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్: తూర్పు నియోజకవర్గంలోని జలగం రామారావు పాఠశాలలో ఈ నెల 14న నిర్వహించనున్న జాబ్‌మేళాను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్‌ను ఆయన శనివారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు ప్రముఖ సంస్థలు వస్తున్నాయని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకు చదివిన యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, చిష్టి, తెదేపా నాయకులు మీరావలి, మహంకాళి నరసింహారావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, కోటా పిచ్చిరెడ్డి, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తూర్పు విభాగపు ట్రాఫిక్ సి.ఐ.అశోక్ కుమార్ హెచ్చరించారు. శనివారం తూర్పు విభాగపు పరిధిలోని ఎన్‌టిఆర్ ఐలాండ్ సెంటర్, అన్న క్యాంటీన్ సెంటర్, బి.ఆర్.స్టేడియం సెంటర్, కోడిగుడ్డు సత్రం పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఆక్రమణల్ని తొలగించారు. సి.ఐ.అశోక్‌కుమార్ మాట్లాడుతూ బస్టాండు పరిసర ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణల వల్ల ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. ఇక నుంచి ట్రాఫిక్ పోలీసులు నగర ప్రధాన రహదారులపై నిఘా ఉంచుతారన్నారు. అనంతరం బి.ఆర్.స్టేడియం, బస్టాండు సెంటర్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఉంచిన గృహ నిర్మాణ సామాగ్రిని ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ.రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


బి.ఆర్.స్టేడియం సెంటర్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సి.ఐ.అశోక్‌కుమార్


మాట్లాడుతున్న సీఐ లత. చిత్రంలో ఏఈఎస్ మారయ్యబాబు, ఎస్సై షరీఫ్

గంజాయితో జీవితాలు పాడు చేసుకోవద్దు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గంజాయికు బానిసలుగా మారి జీవితాలు పాడుచేసుకోవద్దని ఎక్సైజ్ గుంటూరు-1 స్టేషన్ సీఐ లత హితవు పలికారు. శనివారం వసంతరాయపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించినా, అక్రమంగా రవాణా చేసినా, అమ్మినా ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఎస్ మారయ్యబాబు, ఎస్సై షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. బ్రాడీపేట యూటీఎఫ్ సమావేశ మందిరంలో ఈ నెల 22 వరకు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, నిష్ణాతులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. 8, 9, 10 తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఆటోడ్రైవర్ పెద్దమనసు

మొబైల్ చలివేంద్రంతో ప్రజల దాహం తీరుస్తూ..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

సాయం చేయాలనే ఆలోచన ఉండాలే కాని.. అందుకు భారీగా డబ్బులు ఉండాల్సిన అవసరం లేదని నిరూపిస్తున్నారు ఈ ఆటో డ్రైవర్. రోజూ తాను సంపాదించిన దానిలో కొంత మొత్తం కేటాయించి వేసవిలో ప్రజల దాహార్తి తీర్చుతున్నారు గోలుసు కొండలరావునగర్‌కు చెందిన ఎం.దేవా. 2020 సంవత్సరం ఏప్రిల్ నెలలో కొవిడ్ కాలంలో లాక్‌డౌన్. అత్యవసర పనులు, ఆసుపత్రులకు వెళ్లే వారిని మాత్రమే అనుమతిస్తున్నారు. దుకాణాలు మూసివేసి ఉండడంతో వేసవిలో దాహంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన దేవా ఉచిత ధర్మ చలివేంద్రం ఏర్పాటు చేయాలని భావించారు. తన ఆటోలో ఒక చల్లని మినరల్ వాటర్ డబ్బా ఏర్పాటు చేసుకొని నగరంలోని వారి దాహం తీర్చవచ్చని నిర్ణయించుకున్నారు. దేవా తెదేపా అభిమాని. సీఎం చంద్రబాబునాయుడికి వీరాభిమాని. ఈ నేపథ్యంలో చంద్రబాబు పుట్టిన రోజునాడు 2020 ఏప్రిల్ 20న మొబైల్ ధర్మ చలివేంద్రం ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా నిర్వహిస్తున్నారు.

నెలకు రూ.10 వేల ఖర్చు

ప్రయాణికులను తరలిస్తున్న క్రమంలో ఆటోకు నీళ్లడబ్బా కట్టుకొని దాహం వేసిన వారికి నీరు అందిస్తుంటారు. ప్రయాణికులను దించాక ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద నిలిపి తాగునీరు ఇస్తుంటారు. అలా రోజుకు ఆరు చల్లని నీటి డబ్బాలతోపాటు గ్లాసులు, పెట్రోలుకు కలిపి రూ.300 చొప్పున నెలకు రూ.10 వేలు ఖర్చవుతుందని దేవా తెలిపారు. చంద్రబాబునాయుడిపై తనకు ఉన్న అభిమానాన్ని చాటుతూ ఆటో వెనుక ప్రజల ఆశీస్సులు అందించాలని కోరుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.


తాగునీరు అందజేస్తున్న డ్రైవర్ దేవా

సహజ విద్యకు నెలవు ప్రభుత్వ పాఠశాలలే

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోనే సహజసిద్ధమైన విద్య లభిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, వంగిపురం, గొట్టిపాడు, చినకొండ్రుపాడు, యనమదల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థులకు ఒక మెడల్ తోపాటు, ప్రశంసాపత్రం, స్టీఫెన్‌హాకింగ్ పుస్తకం బహుమతిగా ఇచ్చారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖరరావు, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్య వీడియోలు పెట్టినవారిపై చర్యలు తీసుకోండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో తనపై, జగన్ మోహన్‌రెడ్డిపై అసభ్యకర వీడియోలు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు శనివారం ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో కిరాక్ ఆర్పీ, సీమరాజు తమపై పెట్టిన వీడియోలను పెన్‌డ్రైవ్‌లో ఎస్పీకి అందించామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 18న హైకోర్టులో తానే స్వయంగా వాదనలు వినిపించనున్నట్లు చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైకాపా తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఆ పార్టీ నాయకులు వజ్రబాబు, భగవాన్, రామకృష్ణారెడ్డి, హరికృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

మందుబాబులపై కేసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై శనివారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మూడు వంతెనల సెంటర్‌లో ట్రాఫిక్ సి.ఐ.అశోక్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఒక ఆటో, 9 ద్విచక్రవాహనాల్ని సీజ్ చేశారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్.ఐ.రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని శనివారం రాత్రి నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కృష్ణబాబుకాలనీలోని ఖాళీ స్థలాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారంతో సీఐ నజీర్‌బేగ్ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. రాజేష్, అజయ్, దావీదు, అశోక్ అనే యువకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద సుమారు 900 గ్రాముల గంజాయిని జప్తు చేసినట్లు తెలిసింది. మరి కొంతమంది కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

స్టీల్ స్టూళ్లు, సిమెంటు బల్లల వితరణ

పెదకాకాని, న్యూస్‌టుడే : స్థానిక మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కూర్చునేందుకు 10 సిమెంటు బల్లలను గ్రామానికి చెందిన బోయపాటి వెంకటరమణ అందించారు. గుంటూరులోని పీపుల్స్ ఆసుపత్రి వైద్యుడు కేసరి వెంకటేశ్వర రెడ్డి, వెంకట ప్రియాంక దంపతులు వారి కుమార్తె జాహ్నవి, కుమారుడు కౌశిక్‌లు భోజనశాలకు రూ.లక్ష విలువ చేసే 6 స్టీల్ టేబుల్స్, 30 స్టూళ్లు ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజల అనంతరం దాతలకు ఈవో గోగినేని లీలాకుమార్ స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.


దాతలకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఈవో లీలాకుమార్

గుంటూరు పశ్చిమ



న్యాయమూర్తికి స్వాగతం

జ్యుడీషియల్ ఆఫీసర్స్ కార్యశాలకు శనివారం జిల్లా కోర్టుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ నినాల జయసూర్యకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్



ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 14, వంగ 28, బెండ 29, పచ్చి మిర్చి 20, కాకర 40, బీర 44, క్యాబేజి 16, క్యారెట్ 29, దొండ 19, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 18, గోరుచిక్కుళ్లు 34, దోస 16, సొర 20, పొట్లకాయ 24, అరటికాయ 7, చామదుంప 40, బీట్‌రూట్ 28, కీరదోసకాయ 39, బీన్స్ 80, క్యాప్సికమ్ 55, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 38, అల్లం 44, వెల్లుల్లి 94. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాల్వల్లో మురుగు తొలగింపు: గుండారావుపేట ప్రధాన వీధుల్లోని కాల్వల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి కాల్వల్లో పూడిక తీయించారు.

చెత్త తొలగింపు: సాంబశివరావుపేటలోని ప్రధాన వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి చెత్తను తొలగించారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

14న జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి

ఎన్టీఆర్ సర్కిల్: తూర్పు నియోజకవర్గంలోని జలగం రామారావు పాఠశాలలో ఈ నెల 14న నిర్వహించనున్న జాబ్‌మేళాను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్‌ను శనివారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకు చదివిన యువత వినియోగించుకోవాలని కోరారు.

అమ్మ మాటలే స్ఫూర్తి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు టి.వి.విజయలక్ష్మి

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే





తల్లి సీతారావమ్మతో విజయలక్ష్మి

'ఆడ పిల్లలు చదువుకుని వారి కాళ్లపై వారు నిలబడాలి. ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగం చేసి ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి అమ్మ సీతారావమ్మ చెప్పిన మాటలే నన్ను ప్రభుత్వ అధికారిగా నిలబెట్టింది'.. అని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తలారి వెంకట విజయలక్ష్మి తెలిపారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లితో అనుబంధం ఆమె మాటల్లోనే.. 'మాది కృష్ణా జిల్లా మచిలీపట్నం. మేము నలుగురు అమ్మాయిలం, ముగ్గురు అబ్బాయిలు. నేను అయిదో సంతానం. మా అమ్మ సీతారావమ్మ గృహిణి. నాన్న మాణిక్యరావు కేడీసీసీ బ్యాంకులో మేనేజర్. అమ్మ అప్పట్లో ఏడో తరగతి చదివారు. 13 ఏళ్లకే పెళ్లి చేయడంతో టీచర్ అవ్వాలన్న అమ్మ కోరిక తీరలేదు. నలుగురు ఆడపిల్లల్నీ డిగ్రీ వరకు చదివించారు. నన్ను టీచర్‌గా చూడాలనుకుంది. నేను డిగ్రీతో పాటు బీఈడీ చదివి 1989లో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికవడంతో కృష్ణా జిల్లా కత్తులవానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చేరాను. నెల రోజుల్లో జిల్లా పంచాయతీరాజ్ శాఖలో వీడీవో (మహిళ), 1999లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, 2001లో ఎంపీడీవో పోస్టులకు ఎంపికయ్యా. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక.. వారి బాగోగులు చూసేందుకు అమ్మా, నాన్న మావద్దే ఉండేవారు. 2022లో డీఎల్‌డీవోగా పదోన్నతి పొంది డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వహిస్తున్నా. నా ప్రతి విజయంలో అమ్మ ఉంది.'.. అని విజయలక్ష్మి గుర్తు చేసుకున్నారు.

అన్నీ తానై.. - గల్లా మాధవి, పశ్చిమ ఎమ్మెల్యే



అమ్మ శివకుమారితో ఎమ్మెల్యే గల్లా మాధవి

మా అమ్మ నాకెంతో ప్రత్యేకం... క్రమశిక్షణగా లేకపోతే మా అమ్మ శివకుమారి అసలు ఊరుకునేవారు కాదు. నన్ను ఎంతగానో నమ్మారు. ఎంతో స్వేచ్ఛ ఇచ్చారు. మా ఇంట్లో ముగ్గురు సంతానంలో నేను పెద్ద. అందుకే అమ్మ స్వతంత్రంగా ఉండాలని, తప్పు చేయకూడదని నూరిపోశారు. అన్ని విషయాల్లోనూ ఎంతో మద్దతుగా ఉండేవారు. పదో తరగతిలో ఫస్ట్ ర్యాంక్ వచ్చిందంటే అమ్మ ఇచ్చిన ప్రోత్సాహం వల్లే. నాన్న ఉద్యోగరీత్యా బిజీగా ఉండేవారు. మా ఆలనా పాలనా అన్నీ అమ్మే చూసుకున్నారు. నేను సివిల్స్ రాస్తానంటే అడ్డు చెప్పలేదు. అండగా ఉంటానని భరోసా ఇచ్చి ప్రోత్సహించారు. మా కులాంతర ప్రేమ వివాహంలోనూ అమ్మ ఎంతో అండగా నిలిచారు. నాన్న శివయ్యను ఒప్పించడంతో పాటు రామచంద్రరావు తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ హడావుడిలో పడి ఆరోగ్యాన్ని లెక్క చేయలేదు. మధుమేహం పరీక్షలు చేయించుకోకుండా ప్రాణం మీదకు తెచ్చుకున్నారు. కిడ్నీలు పాడైపోయే వరకు పట్టించుకోలేదు. మా కోసం ప్రాణాలను ఫణంగా పెట్టారు. కమ్యూనిస్టు భావాలు ఆమె సొంతం. ఆ రోజుల్లోనే మహిళలకు స్వేచ్ఛ ఉండాలని పరితపించారు.

- న్యూస్‌టుడే, పట్టాభిపురం

ఆమె సంకల్పమే అభివృద్ధికి సోపానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమ్మ సంకల్పిస్తే అభివృద్ధి చెందని కుటుంబం ఉండదు. బాగా చదువుకోకపోయినా పిల్లల చదువు, భవిష్యత్తును ముందే ఊహించి అందరినీ తన తెలివితేటలతో పెంచి పెద్ద చేసిందామె. ఆడపిల్లలకు అంతంత చదువులు అవసరమా అని సమాజం వెనక్కి లాగే రోజుల్లో నలుగురు పిల్లల్లో ముగ్గురిని ఎంకాం, ఎంఏలుగా తీర్చిదిద్దారు. అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో స్థిరపడేలా చేశారు. ఆ తల్లి పేరే మాధవపెద్ది మీనాక్షి. పెళ్లి నాటికి 12 సంవత్సరాలు. సంగీతం తప్ప మరే చదువూ లేదు. బంధువుల తాకిడి. వంటావార్పు. తానూ డిగ్రీ అనిపించుకోవాలన్న తపనతోనే పెద్దమ్మాయితో పాటు పదో తరగతి, మూడో అమ్మాయితో పాటు డిగ్రీ పూర్తి చేశారు. ఆడవాళ్లకు చదువులెందుకు? అనే చుట్టుపక్కల వాళ్ల నోళ్లు మూత పడేలా బిడ్డల ప్రగతిని చూపించారు. ఇప్పటికీ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌ల ద్వారా సంగీత బోధన చేస్తున్నారు. ఆడపిల్లల్లో విజయలక్ష్మి, పద్మజ, గిరిజలు.. మాధవపెద్ది సిస్టర్స్‌గా, వారి పిల్లలు స్వరగాత్రి సిస్టర్స్‌గా కచేరీలు చేస్తూనే ఉన్నారు.



తన కుమార్తెలు విజయలక్ష్మి, పద్మజ, గిరిజలతో సంగీత సాధనలో మాధవపెద్ది మీనాక్షి

రేపు వెల్‌నెస్ సెంటర్‌కు సెలవు

పట్నంబజారు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌కు బుద్ధ పూర్ణిమ సందర్భంగా సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించిందని గుంటూరు సీజీహెచ్‌ఎస్ ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని సిజిహెచ్‌ఎస్ కార్డు హోల్డర్లు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం రావద్దని సూచించారు.

ఆ పాఠశాలలకు పోస్టులు పెంచాలి

గుంటూరు విద్య: గత ఏప్రిల్‌లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినందున విద్యార్థుల సంఖ్య పెరిగిందని, అలాంటి బడులకు పోస్టులు అదనంగా కేటాయించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజును కోరారు. శనివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ హేతుబద్ధీకరణకు కటాఫ్ ఏప్రిల్ నెలాఖరు వరకు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:40గా తీసుకోవాలన్నారు. భాషా పండిట్, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ పదోన్నతులు కల్పించాలన్నారు. ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు ఉన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి



జవాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆళ్ల హరి తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: యుద్ధంలో నేలకొరిగిన తెలుగు తల్లి ముద్దుబిడ్డ జవాన్ మురళీ నాయక్ ప్రాణత్యాగాన్ని దేశం ఎప్పటికీ మరచిపోదని జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి అన్నారు. శ్రీనివాసరావుతోటలోని రామనామక్షేత్రంలోని భరతమాత విగ్రహం దగ్గర జవాన్ మురళీనాయక్‌కు కూటమి నాయకులు శనివారం కన్నీటి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూపూడి భవాని, విమలాదేవి, వడ్డే సుబ్బారావు, నండూరి స్వామి, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

తితిదే ఉద్యోగులకు శిరస్త్రాణాల వితరణ



తితిదే ఉద్యోగులకు శిరస్త్రాణాలు అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు, చిత్రంలో బోర్డు సభ్యుడు శాంతారామ్, వీజీవో రామ్‌కుమార్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగులకు ఛైర్మన్ బీఆర్‌నాయుడు శనివారం ఉదయం శిరస్త్రాణాలు పంపిణీ చేశారు. తితిదే ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మాట్లాడుతూ. తిరుమల నుంచి తిరుపతికి వచ్చే తితిదే ఉద్యోగులకు ప్రయాణ సమయంలో భద్రత కల్పించడంలో భాగంగా వాటిని పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, దిల్లీకి చెందిన కేసీఎన్ సంస్థ అధినేత నవీన్ ఇందుకు ముందుకు వచ్చి మొదటి విడతలో రూ.5 లక్షల విలువైన 555 శిరస్త్రాణాలను విరాళంగా అందించారన్నారు. 15 రోజుల్లో మరో 500 శిరస్త్రాణాలు ఇస్తారని, పరిశీలించి బాగున్నాయని చెబితే మరో ఐదువేలు అందిస్తారని వెల్లడించారు. తితిదే బోర్డు సభ్యులు శాంతారామ్, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

వాల్వ్ గుంత.. రాకపోకలకు చింత



గోరంట్ల ప్రధాన సెంటర్లో నడి రోడ్డుపై వాల్వ్ గుంత ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. హోసన్న మందిరం వైపు నుంచి నగరంలోకి వచ్చే మార్గంలో ఉన్న ఈ గుంతతో వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాల్వ్ చుట్టూ మట్టితో కప్పి ఉంచడంతో అటుగా వచ్చే చోదకులు గుంతను చూసి సడన్ బ్రేక్ వేసి వాహనాన్ని ఒక్కసారిగా ఆపేస్తున్నారు. పలు సందర్భాల్లో వెనక వచ్చే వాహనదారులు కింద పడుతున్నారు. అధికారులు స్పందించి వాల్వ్ గుంత రోడ్డుకు సమాంతరంగా ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోరంట్ల

ఎప్పుడు పిలిచినా యుద్ధానికి సిద్ధమే





మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న మోటూరి శంకరరావు, రత్నప్రసాద్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పాక్ ఉగ్రవాద చర్యలను తిప్పికొట్టే ఆయుధ సంపత్తి భారత్ సొంతమని మాజీ సైనికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు తెలిపారు. అమరుడైన మురళీనాయక్ చిత్రపటానికి తెదేపా జిల్లా కార్యాలయంలో శనివారం నివాళులర్పించారు. శంకరరావు మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో ఉగ్రవాద చర్యలు 30 ఏళ్లుగా ఉన్నాయని తెలిపారు. మళ్లీ సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాజీ సైనికుల సంఘం గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సైన్యం పేరుతో మాజీ సైనికుల జాబితా తయారు చేస్తున్నామన్నారు. అర్ధరాత్రి ఫోన్ వచ్చినా సరే యుద్ధానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఎటువంటి అవసరం ఉన్నా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సైనికుల సంఘం మాజీ అధ్యక్షుడు మాదాల చినకొండలరావు పాల్గొన్నారు.

ఏసీ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ప్రిన్సిపల్స్ ఆండ్రూస్, ముత్యం, వైస్ ప్రిన్సిపల్ శారద తదితరులు

నగరంపాలెం, న్యూస్‌టుడే: ఆంధ్రక్రైస్తవ (ఏసీ) కళాశాలలో 1987-90 విద్యాసంవత్సరంలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాలలోని జేడీ శీలం సమావేశ మందిరంలో శనివారం ఘనంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున సమ్మేళనానికి హాజరై ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు చదువు చెప్పిన అధ్యాపకులను సమ్మేళనానికి ఆహ్వానించారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్స్ ఆండ్రూస్, పి.ముత్యం, బి.రత్నం, రాధాకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్స్ శారద, రాజ్యలక్ష్మిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ నాటి కాలంలో కళాశాలల్లో సీటు దొరకడమే కష్టమయ్యేదని, సీటు దొరకడం కళాశాలలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందని పాత స్మృతులను నెమరువేసుకున్నారు.

అపరిశుభ్రత.. భరించలేని దుర్గంధం

వెన్‌లాక్ మార్కెట్ పరిస్థితి ఇదీ

న్యూస్‌టుడే-నగరపాలకసంస్థ (గుంటూరు)



మార్కెట్‌లో చేపల విక్రయాలు

జీఎంసీ కార్యాలయానికి వెనుక వైపునే ఉన్న వెన్‌లాక్ చేపలు, మాంసం మార్కెట్ అపరిశుభ్రతకు చిరునామాగా ఉంది. ఇక్కడ స్వచ్ఛత గురించి ప్రజారోగ్య విభాగం అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారేగానీ చేపల మార్కెట్‌ను మాత్రం వదిలేశారు. వెన్‌లాక్ మార్కెట్ భవన నిర్మాణంలోనే ఇంజినీరింగ్ లోపాలతో అనేక సమస్యలున్నాయని ఏళ్లుగా అధికారులు చెప్పడమేగానీ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారు. మార్కెట్‌లో నిర్మించిన సెల్లార్, డ్రెయినేజీ వ్యవస్థ, దుకాణాల డిజైన్‌లో లోపాలతో ఇక్కడ చాలా వరకు ఖాళీగానే ఉంటున్నాయి. వెన్‌లాక్ మార్కెట్‌లో మొత్తం 250కిపైగా దుకాణాలు ఉండగా వీటిలో కొన్నింటిలోనే వ్యాపారాలు నడుస్తున్నాయి.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ.. : మార్కెట్‌కు నిత్యం రేపల్లె, బాపట్ల, ఇతర డెల్టా ప్రాంతాల నుంచి చేపలు, రొయ్యలు వస్తుంటాయి. వీటితో పాటు చికెన్, మటన్ దుకాణాలు కలిపి మొత్తం 120 వరకు ఉన్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీరు పారుదలకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. నీరంతా సెల్లార్‌లోనే నిలిచిపోతోంది. భరించలేని దుర్గంధం వ్యాపిస్తోంది. ఇది భరించలేక జీఎంసీ కార్యాలయ భవనంలో మార్కెట్‌వైపు ఉన్న కిటికీలు, తలుపులు కనీసం తెరవలేని పరిస్థితి. ఇక్కడ వ్యాపారాలు నిర్వహించలేక కొందరు మార్కెట్ పక్కనున్న రహదారి మార్జిన్‌లో దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్యలొస్తున్నాయి.

ఇలా చేస్తే ఉపయోగకరం.. : సమస్యల పరిష్కారానికి వెన్‌లాక్ చేపలు, మాంసం మార్కెట్‌ను పొన్నూరు రోడ్డులోని ప్రభుత్వ ఖాళీస్థలంలోకి తరలించేందుకు గతంలో ప్రతిపాదించారు. ఇది అమలుకు నోచుకోలేదు. మార్కెట్‌ను తరలించేంత వరకు ఇక్కడ మౌలిక సదుపాయాల మెరుగుకు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేసి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇంజినీరింగ్ లోపాలు సవరించి మిగిలిన దుకాణాలు వినియోగంలోకి వచ్చేలా చూడాలి.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న జయరాజ్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ ఆలోచనల స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలని కవి జయరాజ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కుల రహిత సమాజం సంస్థ ఆధ్వర్యంలో బ్రాడీపేట లూథరన్ ఆంగ్ల మాధ్యమం హైస్కూలు ఆవరణలో శనివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం సాధించిన ప్రగతి, అమలు తీరు, బహుజన వారియర్స్ జీవిత చరిత్రలు, అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు అనే అంశాలపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. తొలుత గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నిర్వాహకులు నివాళులర్పించారు. అనంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో చదువుతున్న మయన్మార్ బౌద్ధ భిక్షువులు ప్రార్థన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కవి జయరాజ్ మాట్లాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బుద్ధిస్ట్, అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ఆచరించిన జ్యోతిబాపులే, అంబేడ్కర్‌లు యువతరానికి ఆదర్శమన్నారు. సభకు అధ్యక్షత వహించిన విద్యావేత్త డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, బీపీ మండల్ మహాసేన నిర్వాహకుడు డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు, విశ్రాంత డీఎస్పీ పి.రవికుమార్, ఏసీఎఫ్ రాష్ట్ర మహిళా కన్వీనర్ రజిని, అల్లాడి దేవకుమార్, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం అంతమే భారత్ లక్ష్యం

పట్టాభిపురం: కాల్పుల విరమణకు భారత్-పాక్‌లు అంగీకారం తెలపడం శుభసూచకమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. గుంటూరులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'పాకిస్థాన్ ముష్కరులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న వేళ అనునిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఉగ్రవాద భూతాన్ని అంతం చేయడమే భారత్ లక్ష్యం. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం మన సైనికుల అంకితభావానికి నిదర్శనం. ఇప్పటికే పాక్‌లో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. అందుకే వెనక్కి తగ్గింది. సైనికుడు మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరవదు'.. అన్నారు.

అలరించిన కీర్తనల గానం



రమాగోపాలకృష్ణ బృందం గానాలాపన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ స్మృత్యంజలి కీర్తనల గానం శనివారం రాత్రి జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతలపాటి రమాగోపాలకృష్ణ, పావని, నాగలక్ష్మి అన్నమాచార్య విరచిత కీర్తనల గానం చేశారు.

జూద గృహాలపై పోలీసుల దాడులు

27 మంది అరెస్టు

